




RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం – మా పంతం








కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 262 శుక్రవారం, అక్టోబర్ 09 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com


# విచారణ చేశారా? వివరాలు దాచి పెట్టారా ?

- డొంకతిరుగుడుగా చంద్రుగొండ తాసిల్దార్ విచారణ నివేదిక
- సర్వే నంబర్ల తారుమారు మర్మమేమిటి?
- ఎవరిని రక్షించడం కోసం తప్పుడు నివేదిక?

రెవిన్యూ శాఖ
తహశీల్దార్ వారి కార్యాలయం : చంద్రుగొండ

ఆర్.సి.నెం.బి/435/2026. తేది : 16.09.2026.

From,
శ్రీ. D. జగదీశ్వర ప్రసాద్
తహశీల్దార్ చంద్రుగొండ
ఆర్యా,

To,
శ్రీయుత జిల్లా కలెక్టర్,
భద్రాద్రి కొత్తగూడెం గారికి.

విషయం:- Adverse News - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా-కొత్తగూడెం డివిజన్-చంద్రుగొండ మండలం- మద్దుకూరు గ్రామము – జోర్దార్ దినపత్రిక లో "ప్రశ్నార్థకంగా మారిన కారుణ్య నియామకం" అను శీర్షిక పై విచారణ నివేదిక సమర్పించుట గురించి.

సూచన: 1.శ్రీయుత జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి లేఖ RC.No.E2/2344/2026, Dated:01.08.2026.
2.గ్రామ పాలన అధికారి, మద్దుకూరు మరియు మండల గిర్దావర్-II, చంద్రుగొండ గార్ల నివేదిక తేది:16.09.2026.

****

పై విషయ సూచనలను దయతో పరిశీలించగలరు. పై సూచన 1 ప్రకారంగా, శ్రీయుత జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామము శ్రీ.నల్లమోతు. రాకేష్ చౌదరి S/o నాగేశ్వర్ రావు గారికి జారీచేసిన తప్పుడు No Property Certificate పై జోర్దార్ దినపత్రిక లో "ప్రశ్నార్థకంగా మారిన కారుణ్య నియామకం అను శీర్షిక పై విచారణ జరిపి నివేదిక సమర్పించగలరని ఆదేశించియున్నారు.

ఇట్టి విషయమై గ్రామ పాలన అధికారి, మద్దుకూరు మరియు గిర్దావర్-II, చంద్రుగొండ గార్ల నివేదిక ప్రకారంగా, స్థానిక విచారణలో శ్రీ.నల్లమోతు రాకేష్ చౌదరి తండ్రి నాగేశ్వరరావు గారికి 01.12.2015 లో నో ప్రాపర్టీ & నో ఎర్నింగ్ సర్టిఫికెట్లు తాసిల్దార్ కార్యాలయం నుండి ఇచ్చి ఉన్నారని, శ్రీ నల్లమోతు రాకేష్ చౌదరి గారి తండ్రి అయిన నల్లమోతు. నాగేశ్వరరావు S/o వెంకటరత్నం గారు APMO గా చంద్రుగొండ PHC లో ఉద్యోగం చేస్తూ అనారోగ్య కారణం వల్ల ది: 30.05.2014 న మరణించడం జరిగినదని, శ్రీ.నల్లమోతు. రాకేష్ చౌదరి గారి ముత్తాతగారైన శ్రీ.నల్లమోతు.సుబ్బయ్య S/o రామయ్య గారికి మద్దుకూరు రెవిన్యూ గ్రామములో సం.1957-58 నుండి 2010-11 వరకు పహాణి నందు పట్టాదారునిగా నమోదై ఈ క్రింది తెలిపిన సర్వే నెంబర్లలో భూమి కలదు.

| Sl.No | పట్టాదారుని పేరు | సర్వే నెంబరు | విస్తీర్ణం (య. గుం.లు) |
|---|---|---|---|
| 1 | శ్రీ.నల్లమోతు.సుబ్బయ్య S/o రామయ్య | 1/ఊ | 0.19 |
| 2 | | 11/ఇ | 0.30 |
| 3 | | 69 | 4.02 |
| 4 | | 96/ఉ | 14.20 |
| 5 | | 102/ఉ | 1.21 |
| 6 | | 229 | 17.04 |
| 7 | | 136 | 3.36 |
| 8 | | 231 | 18.00 |
| 9 | | 249/ఎ | 1.00 |
| | మొత్తం | | 61.07 |

మరియు శ్రీ.నల్లమోతు. సుబ్బయ్య S/o రామయ్య గారి కుమారుడైన శ్రీ.నల్లమోతు వెంకటరత్నం గారికి ముగ్గురు కుమారులని 1.నల్లమోతు.నాగేశ్వర్ రావు S/o వెంకటరత్నం, 2. నల్లమోతు.సత్యనారాయణ S/o వెంకటరత్నం మరియు 3.నల్లమోతు. వెంకటరమణ S/o వెంకటరత్నం మరియు ఇట్టి భూమి నుండి వారసత్వ వాటాగా శ్రీ.నల్లమోతు.నాగేశ్వరరావు గారికి మద్దుకూరు రెవిన్యూ పరిధిలో సం. 2010-11 నుండి 2016-17 నందు పట్టాదారునిగా నమోదై ఈ క్రింద తెలిపిన సర్వే నెంబర్లలో భూమి కలదు.

| Sl.No | పట్టాదారుని పేరు | సర్వే నెంబరు | విస్తీర్ణం (య. గుం.లు) |
|---|---|---|---|
| 1 | నల్లమోతు.నాగేశ్వరరావు S/o సుబ్బయ్య | 11/ఇ | 0.30 |
| 2 | | 69/అ | 4.02 |
| 3 | | 231/అ | 3.00 |
| 4 | | 96/ఉ/2 | 6.00 |
| 5 | | 230/అ | 6.00 |
| | మొత్తం | | 19.32 |

శ్రీమతి. నల్లమోతు వాణి W/o నాగేశ్వరరావు గారికి ఈ క్రింది తెలిపిన విధముగా కలదు.

| Sl.No | పట్టాదారుని పేరు | సర్వే నెంబరు | విస్తీర్ణం (య. గుం.లు) |
|---|---|---|---|
| 1 | శ్రీమతి. నల్లమోతు వాణి W/o నాగేశ్వరరావు | 151/అ/3 | 3.00 |
| 2 | | 151/ఆ/1 | 0.16 |
| 3 | | 151/అ/5 | 1.00 |
| 4 | | 151/అ/4 | 1.00 |
| 5 | | 151/ఆ/3 | 1.08 |
| | మొత్తం | | 6.24 |

మరియు నల్లమోతు రాకేష్ చౌదరి S/o నాగేశ్వర్ రావు గారికి వారసత్వ వాటాగా వచ్చిన భూమి వివరములు ఈ క్రింద తెలిపిన విధముగా కలదు.

| Sl.No | పట్టాదారుని పేరు | సర్వే నెంబరు | విస్తీర్ణం (య. గుం.లు) | రిమార్కులు |
|---|---|---|---|---|
| 1 | నల్లమోతు రాకేష్ చౌదరి S/o నాగేశ్వర్ రావు | 229/అ/1/1 | 5.29 | వీరికి 2017-2018 లో ధరణి యందు వారసత్వ వాటాగా భూమి మార్పిడి జరిగినదని, e-ppb No.T27070100227 & Khata No.490 |
| 2 | | 40/ఆ | 2.13 | |
| 3 | | 136/అ | 1.31 | |
| 4 | | 137 | 2.21 | |
| 5 | | 232 | 3.00 | |
| 6 | | 1/ఋ | 0.20 | |
| | మొత్తం | | 15.34 | |

శ్రీ. నల్లమోతు రాకేష్ చౌదరి S/o నాగేశ్వర్ రావు (లేటు) గారికి కారుణ్య నియామకం క్రింద ది:17.08.2016 న PHC, పట్వారిగూడెం నందు పొందడం జరిగినదని, మరియు కారుణ్య నియామకం జరిగిన నాటికి ఎటువంటి భూములు మరియు ఆదాయం లేదని, వీరికి చెందినా భూములు తాత-ముత్తాతల నుండి వారసత్వముగా పొందిన భూములని తమ వాంగ్మూలం ద్వారా తెలిపియున్నారు (జత పరచనైనది) కావున తదుపరి చర్యకై సమర్పించనైనది.

Encl: As above

మీ విశ్వాసపాత్రులు
తహశీల్దార్, 17/09/2026
చంద్రుగొండ

**హైదరాబాద్/ ఖమ్మం జోర్దార్ నిఘా విభాగం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ తాసిల్దార్ నిందితుల్ని రక్షించాలనే లక్ష్యంతో తూతూ మంత్రం , గందరగోళ విచారణ నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్ నే బురిడీ కొట్టించాలని ప్రయత్నించి దొరికిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సూటిగా అడిగిన ప్రశ్నకు డొంక తిరుగుడు సమాధానంతో తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్ విచారణ రిపోర్టు రూపొందించి సమర్పించారు.
వివరాల్లోకి వెళితే.....

### రాకేష్ చౌదరి కారుణ్య నియామకం

ఖమ్మం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన నల్లమోతు నాగేశ్వరరావు (తండ్రి. వెంకటరత్నం) అసిస్టెంట్ పారామెడికల్ ఆఫీసర్ (ఏపిఎంఓ) గా చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఉద్యోగం చేస్తూ మే2014 లో అనారోగ్యంతో చనిపోయారు. మరణించిన ఉద్యోగి భార్య వాణి తమకు ఎలాంటి జీవనాధారం లేదని, కుటుంబ పోషణ భారంగా ఉందని ప్రార్థిస్తూ తన కుమారుడికి కారుణ్య నియామకం పై ఉద్యోగం ఇప్పించాల్సిందిగా కోరుతూ మే 2015లో ఖమ్మం డిఎం అండ్ హెచ్ ఓ కు దరఖాస్తు చేశారు.
ఆ క్రమంలో మరణించిన ఉద్యోగి కుమారుడు నల్లమోతు రాకేష్ చౌదరి కు ఆగస్టు 2016లో వైద్య ఆరోగ్యశాఖలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పట్వారి గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కారుణ్య నియామకం క్రింద జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగి గా నియామకం జరిగింది.ఆయన ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్ గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నర్సింగ్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు.

### తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం

కారుణ్య నియామకం కోసం నల్లమోతు రాకేష్ చౌదరి తప్పుడు దృవీకరణ పత్రాలు సమర్పించారు. తన కుటుంబ సభ్యుల పేరిట విలువైన ఆస్తులు , ఆదాయాన్నిచ్చే భూములు ఉన్నప్పటికీ స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని మేనేజ్ చేసి నో ప్రాపర్టీ, నో ఎర్నింగ్ సర్టిఫికెట్లు సంపాదించి ఉద్యోగం కోసం సమర్పించారు. రాకేష్ చౌదరి కుటుంబానికి ఆదాయాన్నిచ్చే విలువైన భూములు ఉన్నప్పటికీ చంద్రుగొండ తాసిల్దార్ కార్యాలయం కళ్ళు మూసుకుని నో ప్రాపర్టీ ,నో ఎర్నింగ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. నల్లమోతు రాకేష్ చౌదరి కుటుంబానికి ఎలాంటి స్థిర, చర ఆస్తులు లేవని పైగా పెన్షన్ ఇన్కమ్ సైతం సున్నాగా సూచిస్తూ చంద్రుగొండ తాసిల్దార్ రాఘవాచార్య, డిసెంబర్ 2015లో నో ప్రాపర్టీ సర్టిఫికెట్ జారీ చేశారు.

### తప్పుడు సర్టిఫికెట్లపై "జోర్దార్" కథనాలు

సమాచార హక్కు చట్టం కార్యకర్త కేసగాని శంకర్ అందించిన సమాచారం ఆధారంగా, రాకేష్ చౌదరి కారుణ్య నియామకం కోసం సమర్పించిన తప్పుడు ఫేక్ సర్టిఫికెట్ వ్యవహారంపై జూలై 25 వ తేదీన "అర్హతలు లేకున్నా కారుణ్య ఉద్యోగం" మరియు జూలై 28వ తేదీన "ప్రశ్నార్థకంగా మారిన కారుణ్య నియామకం" శీర్షికలతో జోర్దార్ దినపత్రిక రెండు వార్తలు సాక్ష్యాధారాలతో సహా ప్రచురించింది.

### జోర్దార్ వార్తకు స్పందించి విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా చంద్రుగొండ తాసిల్దార్ రాఘవాచార్య జారీచేసిన తప్పుడు సర్టిఫికెట్ వ్యవహారంపై జోర్దార్ ప్రచురించిన కథనంపై విచారణ చేసి ఐదు రోజుల్లో నివేదిక సమర్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఇ2/2344/2026 తేదీ 01/08/2026 ద్వారా చంద్రుగొండ తాసిల్దారును ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### తప్పును కప్పిపుచ్చే తప్పుడు విచారణ నివేదిక

జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో దోషులు రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు ప్రారంభించారు. తప్పుడు సర్టిఫికెట్ జారీ చేసిన అప్పటి తాసిల్దార్ రాఘవాచార్య మరియు అక్రమ కారుణ్య నియామకం పొందిన నిందితుడు రాకేష్ చౌదరి లను రక్షించే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం చంద్రుగొండ తాసిల్దార్ గా పనిచేస్తున్న జగదీశ్వర ప్రసాద్ "అశ్వద్ధామ హతోహతః.." అన్న రీతిలో ఆకుకు అందని పోకకు పొందని విచారణ నివేదికను రూపొందించారు. జోర్దార్ కథనం ఆధారంగా కలెక్టర్ సూటిగా అడిగిన ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా చంద్రుగొండ తాసిల్దార్ డొంక తిరుగుడు జవాబుతో విచారణ నివేదికను నింపివేశారు.తన నివేదికతో జిల్లా కలెక్టర్ ను సైతం బురిడీ కొట్టించే ప్రయత్నంలో తాసిల్దార్ అడ్డంగా దొరికిపోయారు.

### విచారణ నివేదికపై సవాలక్ష సందేహాలు

రాకేష్ చౌదరి ఉద్యోగ నియామకం (ఆగస్టు 2016)నాటికి ఆయన కుటుంబానికి ఆదాయాన్ని ఇచ్చే ఆస్తులు ఉన్నాయా? లేవా? ఆయన దివంగత తండ్రి లేదా తల్లి పేరిట భూములు ఉన్నాయా? రాకేష్ తండ్రి నల్లమోతు నాగేశ్వరరావుకు మద్దుకూరు రెవెన్యూ పరిధిలో 2010 నుండి 2017 వరకు19.32 ఎకరాల భూమి ఉంది. మరి డిసెంబర్ 2015 లో రాకేష్ కుటుంబానికి ఆస్తులు లేవని నో ప్రాపర్టీ సర్టిఫికెట్ ఎలా జారీ చేశారు?ఈ అంశంపై చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్ విచారణ చేసి సూటిగా జవాబు ఇవ్వకుండా తన నివేదికలో రాకేష్ తాత ముత్తాతల ఆస్తులను ఏకరువు పెట్టారు. ఈ క్రమంలో వారి భూముల సర్వే నెంబర్లను సైతం మార్చివేశారు.తాత ముత్తాతల నుండి వారసత్వంగా ఆస్తులు సంక్రమిస్తే సర్వే నంబర్లు సైతం మారుతాయా? రాకేష్ చౌదరి వాంగ్మూలము, మద్దుకూరు గ్రామ పాలనాధికారి మరియు చంద్రుగొండ మండలం 2వ గిరిదావర్ నివేదికల ఆధారంగా తాసిల్దారు సమర్పించిన విచారణ నివేదికలో పేర్కొన్న వారసత్వంగా సంక్రమించిన భూమి సర్వే నంబర్ల మార్పుకు కారణాలు ఏమిటి? నల్లమోతు సుబ్బయ్య కుమారుడైన వెంకటరత్నం ముగ్గురు కుమారులలో ఒకరైన నాగేశ్వరరావు తండ్రి పేరును పట్టాదారు కాలమ్ లో సుబ్బయ్య గా పేర్కొనడం వెనుక మతలబు ఏమిటి? ఇది తప్పు దోవ పట్టిన విచారణ కాదా?
అంతేకాకుండా రాకేష్ చౌదరి పేరిట 15.34 ఎకరాలు, దివంగత తండ్రి పేరిట 19.32 ఎకరాలు, తల్లి వాణి పేరిట 6.24 ఎకరాలు భూమి ఉన్నట్లు ధృవీకరించారు. అంటే రాకేష్ చౌదరికి గతంలో తాసిల్దార్ రాఘవాచార్య జారీచేసిన నో ప్రాపర్టీ,

### నో ఎర్నింగ్ సర్టిఫికెట్ తప్పని తేల్చారా?

వీటన్నిటిని పరిశీలిస్తే చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్ ఆర్. సి. నెంబర్ బి/435/2026 తేదీ:16.9.2026 ద్వారా జిల్లా కలెక్టర్ కు సమర్పించిన విచారణ నివేదిక పలు సందేహాలకు తావిస్తోంది. తాసిల్దార్ విచారణ నివేదిక జిల్లా కలెక్టర్ ని బురిడీ కొట్టించి, గత తాసిల్దార్ రాఘవాచార్య మరియు నిందితుడు రాకేష్ చౌదరి లను రక్షించే ప్రయత్నంగా కనబడుతోంది. ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సీరియస్ గా స్పందించి చంద్రుగొండ రెవెన్యూ కార్యాలయం రికార్డులను జప్తు చేసి విచారిస్తే అవినీతికి పాల్పడిన రెవెన్యూ అధికారుల గుట్టు రట్టు అవుతుంది. ఆ దిశగా నిజాయితీకి మారుపేరుగా నిలిచిన జిల్లా కలెక్టర్ చర్యలు ఉంటాయా? వేచి చూడాలి మరి.

## బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు




**హైదరాబాద్ :**తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్య బద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

### - 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్




**హైదరాబాద్ :**జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు.ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి.

## ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో.. ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని సూచించారు. (గురువారం) సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న రేవంత్.. బీజేపీ తీరును తీవ్రంగా విమర్శించారు. 'మొదట మతాన్ని, భాషను ఉపయోగించుకుని ప్రధాని మోదీ నెగ్గేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఈ ప్రయోగాలు చెల్లవని 13 కోట్ల ఓట్లు తొలగించి మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్నారు' అని ఆయన మండిపడ్డారు. బ్రిటీషర్స్ సైమన్ కమిషన్ వాడితే, బీజేపీ ఎన్నికల కమిషన్ వాడుతోందని ఆరోపించారు. నాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే నేడు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారి ఓట్లను కాపాడటమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఓట్ల తొలగింపు కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్య అని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్



కుమార్‌ను తొలగించాలని, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పంతాలకు పోకుండా వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో ఏం జరిగిందో ప్రధాని మోదీ విషయంలో కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ ఓట్ల తొలగింపు ద్వారా రెండు రకాల పౌరులు ఏర్పడుతున్నారని

## రైతులకు బేడీలా?

### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్:**

పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు."ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# రిజిస్టర్డ్ స్థలంలో అక్రమ నిర్మాణం

# బాధితుల ఆరోపణలు

- హద్దు రాయి తొలగించి స్థలంలోకి చొరబడ్డారని ఫిర్యాదు
- బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణలు
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని బాధితుల విజ్ఞప్తి





**హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజూరాబాద్ పట్టణంలోని 9వ వార్డులో రిజిస్టర్డ్ ప్రైవేట్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతు న్నారంటూ ఓ కుటుంబం అధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితుల వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 1988/ఏ/సి/ఏలోని 242 గజాల స్థలాన్ని సబ్బని వరలక్ష్మి, బోరగాల సులోచన నుంచి సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. స్థలానికి మూడు వైపులా హద్దు రాళ్లు ఉన్నాయని బాధితులు తెలిపారు.

గత జూన్ 25న 'ఇందిరమ్మ ఇల్లు' పథకం పేరుతో వార్డు సిబ్బంది స్థలంలో జియో ట్యాగింగ్, మార్కింగ్ చేసిన అనంతరం.. బరిగె సమ్మయ్య, పాక స్వరూప, పాక సాయికిరణ్, బోనగిరి నరసయ్యలు హద్దు రాయిని తొలగించి తమ స్థలంలోకి చొరబడి పిల్లర్లు, గోడ నిర్మాణం చేపడు తున్నారని వరలక్ష్మి ఆరోపించారు. నిర్మాణాన్ని ప్రశ్నించిన తనను, భర్త వెంకటస్వామిని దూషిస్తూ చంపేస్తామని బెదిరించారని ఆమె పేర్కొన్నారు.

ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంతో పాటు ఆర్డీవో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ నిర్మాణం నిలిపివేయలేదని బాధితులు తెలిపారు. అంతేకాకుండా తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి, స్థల హద్దులను నిర్ధారించి అక్రమ నిర్మాణం ఉంటే చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం,స్థానికులు కోరుతున్నారు.

# గుడుంబా స్థావరాలపై ఆబ్కారీ శాఖ మెరుపు దాడులు

- 1200 లీటర్ల పులిసిన బెల్లం పానకం ధ్వంసం.. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం



**మంథని జోర్దార్ ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లా మంథనిలో గుడుంబా స్థావరాలపై ఆబ్కారీ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. దసరా పండుగ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో మంథని, పెద్దపల్లి ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ అధికారులు సంయుక్తంగా ఈ దాడులు చేపట్టారు.

మంథని పట్టణంలోని బోయిన్‌పేటకు సమీపంలోని బొక్కలవాగు పరిసర ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1200 లీటర్ల పులిసిన బెల్లం పానకం, 20 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. బోయిన్‌పేటలో గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న కొంతమంది వ్యక్తులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారిపై ఇప్పటికే రెండు నుంచి మూడు కేసులు నమోదై ఉన్నాయని, మరో కేసు నమోదైతే పీడీ యాక్ట్ కింద చర్యలకు సిఫారసు చేస్తామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

బేగంపేటపై ప్రత్యేక దృష్టి

రామగిరి మండలం బేగంపేటలోనూ పెద్ద ఎత్తున గుడుంబా స్థావరాలు ఉన్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. అక్కడ పూర్తి సమాచారం సేకరించి, అక్రమ గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాడుల్లో మంథని, పెద్దపల్లి ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓట్ల సవరింపులో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ

## " సిఇసి " వెంటనే రాజీనామా చేయాలి



- మందమర్రిలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ధర్నా నిర్వహించిన
- మంత్రి వివేక్ వెంకటస్వామి.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఓట్ల సవరింపు ప్రక్రియలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా, ముఖ్య ఎన్నికల అధికారి వెంటనే రాజీనామా చేయాలని, గురువారం మందమర్రి పట్టణంలోని బస్టాండ్ వద్ద మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి, ధర్నాలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

**"ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత"**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ఎలాంటి చర్యలను సహించేది లేదని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు,ఎంపీటీసీలు, పట్టణ నాయకులు, నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, మైనారిటీ విభాగం మరియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల్లో భూముల రీ-సర్వే

## పనులను వేగవంతం చేయాలి



- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:** జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు.

గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను తహసిల్దార్ కృష్ణ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఎంపిక చేసిన గ్రామాలలో రీ-సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రీ-సర్వే పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతున్నాయని, పనులను మరింత వేగంగా, నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రీ-సర్వే కార్యక్రమానికి గ్రామ రైతులు సహకరిస్తున్నారని, అధికారులు, సైతం గ్రామస్తులకు సహకరిస్తూ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్వేయర్ వసంతరావ్, జి.పి.ఓ. శివకుమార్, చైన్ మెన్ రమేష్, మాజీ ఎంపీటీసీ మహేందర్, సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది నిరసన

**భూపాలపల్లి,(జోర్దార్ ప్రతినిధి)**

సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది నిరసన చేపట్టారు.

తమతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎక్కువ వేతనాలు చెల్లిస్తూ, తమకు తక్కువ వేతనాలు ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.




ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు ఇతర ఉద్యోగులతో సమానంగా వేతనాలు,

ఉద్యోగ భద్రత, ప్రయోజ నాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగి స్తామని స్పష్టం చేశారు.

## కోల శ్రీనివాస్‌కు ఆర్జీ-3 సెక్యూరిటీ పగ్గాలు



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** సింగరేణి ఆర్జీ-3 డివిజన్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా కోల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇదే డివిజన్‌లో ఆర్అండ్ఆర్ విభాగం అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను సెక్యూరిటీ అధికారిగా బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అధికారులు, కార్మికులతో సమన్వయంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు కీలక బాధ్యతలు అప్పగించడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఆర్జీ-3 ఏరియాలో భద్రతా ప్రమాణాల పరిరక్షణ, క్రమశిక్షణను మరింత పటిష్టం చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు.ఇప్పటివరకు ఆర్జీ-3 ఏరియా సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన షబ్బీర్‌ద్దీన్‌ను ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం

## వాట్సాప్ నెంబర్ ద్వారా ఫిర్యాదులు పంపండి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.



**మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు కలెక్టరేట్ సముదాయంలో ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుక వెళ్లేందుకు, ప్రభుత్వ సేవల విషయమై ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం ఇకనుండి కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదని, వాట్సాప్ ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు.

హైదరాబాద్‌లోని జిల్లా ఇన్చార్జి మంత్రి పేషీలోనూ ఈ సదుపాయాన్ని కల్పించారని, ప్రజల నుండి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించి పరిష్కరించాలని తెలిపారు.

ఇంచార్జ్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు పేషీనం. 8500689596,

మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయ నెంబర్, 9492123642, ఈ నంబర్‌కు కాల్ చేయవద్దని, ఫిర్యాదులను మెసేజ్ రూపంలో పంపించాలని, ఫిర్యాదు అయితే సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, సంబంధిత ఫొటోలను జత చేయాలని, తద్వారా సమస్యను గుర్తించి, సంబంధిత శాఖకు ఫిర్యాదును పంపించి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు సులభంగా ఉంటుందని తెలిపారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా అందించడంతో పాటు, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ల ప్రధాన ఉద్దేశమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

## వన్యప్రాణులను కాపాడితేనే

## మానవ మనుగడ సాధ్యం



- బెల్లంపల్లి అటవీశాఖ అధికారి పూర్ణచందర్.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:** అడవుల్లోని సంచరించే వన్య ప్రాణులను కాపాడుతేనే, భవిష్యత్తులో మానవ మనుగడ సాధ్యమని, బెల్లంపల్లి అటవీశాఖ అధికారి పూర్ణచందర్ అన్నారు.

గురువారం జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని కాసిపేట మండలం తిరుమలాపూర్ గ్రామంలో స్థానిక గిరిజనులకు అడవులు, అడవుల్లో సంచరించే వన్య ప్రాణులకు ఎటువంటి హాని తలపెట్టవద్దని, అటవీ శాఖ చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయని, తెలిసి చేసిన, తెలియక చేసిన, కోర్టులు,కేసులు, జైళ్ళు తప్పవని అవగాహన కల్పించారు.

అనంతరం అనంతరం స్థానిక గిరిజనులకు ఉన్ని బ్లాంకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఎన్టీఆర్ విగ్రహం వద్ద బస్సు నిలపాలి




**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి):** కర్నూలు నుంచి ఐజకు వెళ్లే గద్వాల డిపో బస్సును శాంతినగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిలపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఉదయం 9.30 గంటలకు వచ్చే ఈ బస్సు అక్కడ ఆగకుండా వెళ్లడంతో విద్యుత్ కార్యాలయం, ఎల్ఎన్ఆర్ కళాశాల, పాఠశాలలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో బస్సులు అక్కడ ఆగేవని, ప్రస్తుతం ఈ బస్సు మాత్రమే నిలవడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బస్సును ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

RNI NO.TGTEL/25/A5224
అవినీతి అంతం - మా పంతం

# ఆర్.జి-3, ఎపిఎ ఏరియాలో కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటన




**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గురువారం కార్పొరేట్ టార్గెట్ కమిటీ పర్యటించింది. పర్యటనలో భాగంగా కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ విభాగం జనరల్ మేనేజర్, కమిటీ కన్వీనర్ జి.దేవేందర్, ఉపరితల గనుల విభాగం జనరల్ మేనేజర్ పి.ఎలీషా, భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఐ అండ్ పి ఎం విభాగం జనరల్ మేనేజర్ యం.వి.నరసింహరావు, ఐఈ విభాగం ఎజిఎం సిహెచ్.వెంకయ్య, రామగుండం రీజియన్ నాణ్యత విభాగం జనరల్ మేనేజర్ జె. వెంకట రమణ లతో పాటు ఇతర కమిటీ సభ్యులు జీఎం కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో పాటు ఏరియా లోని వివిధ గనుల, విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2027-28 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన లక్ష్యం, ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా ఓ.బి (మట్టి వెలికితీత) మొదలగు అంశాల పై చర్చించారు.అదేవిధంగా 2027-28 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా భూగర్భ, ఉపరితల గనులకు కావలసిన యంత్రాలు, యంత్ర సామాగ్రి, పనిముట్లు, సదుపాయాలు అంశాలపై చర్చించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయాలని, భద్రత తో ఉత్పత్తిని సాధిస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎంలు ఎం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయ భాస్కర్, దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్లు జ్ఞాన సంబంధన్, ప్రకాష్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్, కార్పొరేట్ కమిటీ సభ్యులు సిహెచ్. గాబ్రియల్ రాజు, రామక్రిష్ణ, గంగాధర్, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టేట్ అధికారి ఐలయ్యపై విచారణ జరపాలి

- **అధికార పార్టీ అండతో అవినీతి జరుగుతోందని ఆరోపణలు**
- **ఆధారాలను జీఎం, విజిలెన్స్‌కు పంపిస్తున్నాం: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శెంకేషి రవీందర్**




**మంథని జోర్దార్ ప్రతినిధి:**సింగరేణి ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణాలు, భూముల ఆక్రమణలకు సంబంధించి ఆర్జీ-3 ఎస్టేట్ అధికారి ఐలయ్యపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శెంకేషి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం సెంటినరీకాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.స్థానిక అధికార పార్టీ నాయకుడి అండతో ఎస్టేట్ అధికారి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని రవీందర్ ఆరోపించారు. సింగరేణి సంస్థకు చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్న సమయంలో వాటిని కాపాడాల్సిన అధికారి తనకు సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై విచారణ జరపాల్సింది పోయి జీఎం వత్తాసు పలకడం సరికాదన్నారు.

**పాత రశీదులతో కొత్త టేలాలా?**

పాత పీనల్ రెంట్ రశీదులను అడ్డుపెట్టుకుని కొట్టగా టేలాలు వేయిస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని రవీందర్ తెలిపారు. ఆరోపణలకు సమాధానం ఇవ్వాల్సిన అధికారి తమ నాయకుడి పేరును ప్రస్తావించడం ద్వారా రాజకీయ సంబంధాలపై అనుమానాలకు తావిస్తున్నారని అన్నారు.తమ వద్ద ఉన్న ఆధారాలను జీఎంతో పాటు విజిలెన్స్, డైరెక్టర్ పీఏ, సీ అండ్ ఎండీకి మెయిల్ ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. తక్షణమే విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**నిర్మాణాలు.. టేలాలపై లెక్కలు తేల్చాలి**

ఐలయ్య ఎస్టేట్ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సింగరేణి పరిధిలో కొత్తగా ఎన్ని నిర్మాణాలు జరిగాయి? ఎన్ని టేలాలు వేశారు? వకీల్‌పల్లి చర్చి పక్కన ఉన్న భూమి ఆక్రమణకు కారకులెవరు? పాత పీనల్ రెంట్ రశీదులు ఎవరికి బదలాయించారు? అనే అంశాలపై కూలంకషంగా విచారణ జరపాలని రవీందర్ కోరారు.సింగరేణి ఆస్తుల పరిరక్షణలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై బాధ్యత వహించాల్సిందేనని అన్నారు.జీఎం మధుసూదన్ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణకు అవకాశం కల్పించాలని, విచారణ లేకుండా ఎస్టేట్ అధికారికి మద్దతుగా నిలవడం మానుకోవాలని సూచించారు. సమస్యపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, నాయకులు దామెర శ్రీనివాస్, బొంకూరి పోశం, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుకునే వయసులోనే బాలికలపై పెళ్లి భారం



- **ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15--19 ఏళ్ల బాలికల్లో 10.2 శాతం మంది వివాహితులు**

**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన వయసులోనే బాలికలు పెళ్లి, కుటుంబ బాధ్యతల్లోకి అడుగుపెడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15 నుంచి 19 ఏళ్లలోపు బాలికల్లో 10.2 శాతం మంది వివాహితులు, గర్భిణులు లేదా తల్లులుగా ఉన్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 వెల్లడించింది.కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ముంబైలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ నోడల్ ఏజెన్సీగా నిర్వహించిన సర్వేలో పిల్లల ఆరోగ్యం, విద్య, వివాహాలు, కుటుంబ నియంత్రణ, ప్రసవాలు, మహిళల ఆరోగ్యం, సాధికారత తదితర 93 అంశాలను పరిశీలించారు.

సర్వే ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 20--24 ఏళ్ల మహిళల్లో 18 ఏళ్లలోపు వివాహమైన వారి శాతం 19.6గా నమోదైంది. 2019--21 సర్వేలో ఈ శాతం 25గా ఉండగా, ప్రస్తుతం కొంత తగ్గింది. అయినప్పటికీ బాల్య వివాహాలు కొనసాగుతున్నట్లు గణాంకాలుసూచిస్తున్నాయి.బాల్య వివాహాల ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపైనా పడుతోంది. ఐదేళ్లలోపు పిల్లల్లో 38.9 శాతం మందిలో ఎదుగుదల లోపించినట్లు సర్వేలో వెల్లడైంది. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికల విద్య, ఆరోగ్యంపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

# భారతి విద్యాభవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**హనుమ కొండ,(జోర్దార్ ప్రతినిధి)**హన్మకొండ యూనివర్సిటీ విద్యారణ్యపురిలోని భారతి విద్యా భవన్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు,మహిళా ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించారు.

బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ చైర్మన్ తక్కలపల్లి శ్రీదేవి, ప్రిన్సిపల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# కీలకశాఖలు వెళ్లిపోయాయి



**ఆదిలాబాద్,జోర్దార్ :**గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, పాలన సౌలభ్యం కోసం ఐటీడీఏ కేంద్ర స్థానమైన ఉట్నూర్ లో ఏర్పాటు చేసిన పలు కీలక డివిజన్ కార్యాలయాలు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. ఏజెన్సీ ప్రజలకు పాలన చేరువ చేయాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అధికారుల సొంత నిర్ణయాలు తీసుకోవడం, ప్రజాప్రతినిధులు మౌనం వహించడంతో ఇతర ప్రాంతాలకు తరలిపోతుష్టన్నారు. రైతులు, ప్రజలకు సేవలందించే కార్యాలయాలపై పర్యవేక్షణ కరువై పారుసు ప్రాంతాలకు తరలిపోయాయి. గతంలో ఉట్నూర్ ఆర్టీసీ బస్సు డిపో తరలింపునకు ప్రయత్నిస్తే స్థానికులు, ప్రజాసంఘాలు ఆందోళన, ధర్నా చేపట్టడంతో ఆ నిర్ణయం వెనక్కి తగ్గింది. కానీ, వరుసగా ప్రభుత్వ ఆఫీసులు తరలిపోతున్నా స్థానిక నాయకులు నోరు మెదపకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని నిమిత్తం అధికారులను కలవాలంటే గిరిజనులు, రైతులు కాలినడకన, సొంత ఖర్చులతో దూర ప్రాంతాలకు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్యాలయాలను తిరిగి ఉట్నూర్లో పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ (ఏడీ ఆఫీస్) రైతులు సాగు సలహాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయాన్ని ఉట్నూర్ నుండి తరలించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూలనపడ్డ ఆర్అండ్‌బీ డీఈ, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయాలు.

మొబైల్ కోర్టు ఏజెన్సీ ప్రాంతంలోని వివాదాలను అక్కడికక్కడే వేగంగా పరిష్కరించేందుకు అందుబాటులోకి తెచ్చిన మొబైల్ కోర్టును చెన్నూరుకు మార్చారు.

నీటిపారుదల శాఖ (ఇరిగేషన్ ఈఈ/డీఈ ఆఫీసులు) సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణను పర్యవేక్షించే ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) కార్యాలయాలను ఆదిలాబాద్‌కు తరలించారు.

రోడ్లు-భవనాల శాఖ (ఆర్అండ్‌బీ డీఈ కార్యాలయం) ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం, భవనాల నిర్వహణ పర్యవేక్షించే ఆర్అండ్‌బీ డీఈ ఆఫీసును చెన్నూరుకు ముడిపెట్టారు.

విద్యుత్ శాఖ (టెక్నికల్ విభాగం) ఇటీవల విద్యుత్ శాఖకు చెందిన టెక్నికల్ ఏఈ పోస్టు ఉట్నూర్ లో అవసరం లేదంటూ పోస్టును డైవర్ట్ చేసి, కేవలం 20 రోజుల క్రితమే ఈ విభాగాన్ని సిరిసిల్లకు తరలించినట్లు తెలుస్తోంది.

**వెనక్కి తీసుకురావాలి**

ఏజెన్సీ రైతుల కోసం ఇక్కడ ఆఫీసులు పెట్టి, ఇప్పుడు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆఫీసర్లను కలవాలంటే కిలోమీటర్ల దూరంలో ఆదిలాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లాలి. నాడు ఉట్నూర్ బస్సు డిపో కోసం కొట్లాడినట్లే, ఇప్పుడు సమరశంఖం పూరించాలి.

కార్యాలయాలన్నీ ఉట్నూర్కే వెనక్కి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. లేకపోతే ఐటీడీఏ ముట్టడిస్తాం అని పుర్కా బాపురావు, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలిపారు

# రాజోలిలో 850 ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:**2009 వరదల సమయంలో రాజోలి మండల కేంద్రం పూర్తిగా నీటమునిగి, అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. వరద బాధితుల కోసం ప్రభుత్వం 3,160 ఇళ్లను మంజూరు చేయగా, వాటిలో సుమారు 850 ఇళ్లు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయని బీజేపీ నాయకులు తెలిపారు.ఈ విషయాన్ని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె స్పందించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా సూచించినట్లు తెలిపారు. ఎంపీ లేఖను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘాల సంజీవరెడ్డి గురువారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు టి. రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. రామచంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, గద్వాల బీజేపీ అభ్యర్థి శివారెడ్డి, మండల అధ్యక్షుడు కే. శశికుమార్, గోపాల కృష్ణ, మాన్‌దొడ్డి ఉపసర్పంచ్ భీమన్న, వడ్డేపల్లి మాజీ మండల అధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి అధికారులకు బీఆర్ఎస్ వినతి



**టేకుమట్ల జోర్దార్ ప్రతినిది:**టేకుమట్ల మండలంలోని మానేరు, చలివాగు పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను తక్షణమే అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు గురువారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా మైన్స్, జియాలజీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మానేరు, చలివాగు ప్రాంతాల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను తరలిస్తున్నామనే పేరుతో భారీగా ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని నాయకులు తెలిపారు.

ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన ఇసుకను అక్రమంగా తరలించడం వల్ల స్థానికంగా ఇసుక కొరత ఏర్పడటంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, ఇసుక తరలింపునకు ఉన్న అనుమతులు, రవాణా పర్మిట్లు, వాహనాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.

మానేరు, చలివాగు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన సహజ వనరులు అక్రమంగా తరలిపోకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టేకుమట్ల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ముఖ్య నాయకులు బందెల నరేష్, పింగిలి వెంకటేశ్వర రెడ్డి, గువ్వాడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలు అందజేత



**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:**అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన నాయకి రామకృష్ణకు రూ.6 లక్షలు, మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన శైలజ కుమారికి రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● ఎస్సై పోచంపల్లి సతీష్




**భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:** యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ సూచించారు. చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకు వివరాలు లేదా సంకేత సంఖ్యలు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నటనలో మేటి నానా పటేకర్




నటనలో అగ్నిలా రగిలే మనిషి,
నిజాయితీలో మంచులా కరిగే మనిషి.
తెరపై పాత్ర ఏదైనా ప్రాణం పోసి,
ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసి.

పేదవాడి కన్నీటిలో బాధను చూసి,
ఆకలితో ఉన్నవాడి పక్కన నిలిచి,
మాటలకే పరిమితం కాకుండా చేతలతో చూపే
మానవత్వమే ఆయన అసలైన గొప్పదనం.

సినిమా ఒక వైపు... సేవ మరో వైపు,
కీర్తి ఒక వైపు... సరళత మరో వైపు.
ఎంత ఎత్తుకు ఎదిగినా నేలను మరచిపోని
నానా పటేకర్ --- ఒక గొప్ప మనిషి!

నటుడిగా పేరు సంపాదించడం గొప్ప కాదు,
మనిషిగా నిలవడం అంతకంటే గొప్ప.
ఆ గొప్పదనానికి నిలువెత్తు నిదర్శనం ---
నానా పటేకర్!

ప్రముఖ విలక్షణ నటులు నానా పటేకర్ మరణం తీరని లోటు.
బాలీవుడ్ విలక్షణ నటుడు నానా పటేకర్ గుండెపోటుతో కన్నుమూశారు. గోవాలోని ఆయన నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉండగా, వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మరణం చెందినట్లు తెలుస్తుంది .ఆయన మృతిపట్ల భారతీయ సినీ ప్రముఖులు,రచయితలు వారి అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1978లో 'గమన్' చిత్రంతో సినీ ప్రవేశం చేసిన ఆయన.. తన నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో వైవిధ్య భరిత పాత్రలతో నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.
గోవాలోని తన నివాసంలో ఇవాళ గురువారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించడంతో, వెంటనే ఆయన్ను వైద్య సహాయం కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.నానా మృతి పట్ల సినీ రాజకీయ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.
నానా పటేకర్ 1951 జనవరి 1న జన్మించారు. ఆయన అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978 లో 'గమన్' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. హిందీతో పాటుగా మరాఠీ చిత్రాల తోనూ గుర్తింపు తెచ్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న నానా.. కెరీర్ ప్రారంభం నుంచే కథా బలమున్న చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. ఎలాంటి పాత్ర అయినా అందులోకి పరకాయ ప్రవేశం చేయడం ఆయన స్పెషాలిటీ. నానా నటిస్తారనడం కన్నా జీవిస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.
పాత్ర ఎంత పెద్దదైనా, ఎంత చిన్నదైనా దానికి జీవం పోయడం నానాకు మాత్రమే సాధ్యమైన విద్య. కోపం, కరుణ, ఆవేదన, నిస్సహాయత.. ఇలా ఏ భావమైనా ఆయన దగ్గర కృత్రిమంగా అనిపించేది కాదు. ఓవైపు సీరియస్ రోల్స్ చేస్తూనే, మరోవైపు కామెడీ పాత్రల్లో మెప్పించడం ఆయనకే చెప్పింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. 1989లో 'పరిందా' సినిమాలో నానా పటేకర్ నటనకుగానూ ఉత్తమ సహాయ నటుడిగా నేషనల్ ఫిలిం అవార్డు అందుకున్నారు. సినిమా, కళారంగాలలో ఆయన చేసిన కృషికి గాను 2013లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.
నానా పటేకర్ స్ట్రెయిట్ తెలుగు సినిమాలు చేయకపోయినా, డబ్బింగ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. పా.రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటించిన 'కాలా' సినిమాలో ఆయన విలన్ గా నటించారు. అలానే భారతీరాజా డైరెక్షన్ లో నానా నటించిన 'బొమ్మలాట్టం' చిత్రం తెలుగులో 'రాణా' పేరుతో రిలీజ్ అయింది. నానా చివరగా 'ఓ రోమియో', 'సుబేదార్' వంటి హిందీ సినిమాలలో కనిపించారు.
నానా పటేకర్ ఆకస్మిక మరణంతో సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. తన విలక్షణ నటనతో, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నానాకి సినీ అభిమానులు ఘన నివాళులు అర్పిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నారు.

**అమర్ రహే నానాజీ**

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

# క్రాంతివీర్‌కు జోహార్లు...!



అతడు సామాన్యుడే కావచ్చు
నటనతో అసామాన్యుడయ్యాడు
అతని జ్వాలమయమైన స్వరం వింటే చాలు
తనువంతా ఉత్తేజంతో పులకరిస్తుంది
వెండితెర పైన సహజమైన అభినయనం
ప్రేక్షకుల మనసును చూరగొన్నది
అతని కళ్ళల్లోని రౌద్రమైన చూపులు
అసమానతలపైన నవ్వులతో చురకలేయడం
గంభీరమైన వాక్యాలతో నిలదీయడం
విభిన్న పాత్రలోని నట విశ్వరూపంతో
అశేషమైన ప్రపంచ సీని అభిమానుల
హృదయాల్లో చిరస్మరణీయులయ్యారు
ఆయన నిబద్ధతకు ఒక ప్రహార్ చాలు
అరాచకాల పాలనను ప్రశ్నించిన రీల్ హీరోనే కాదు
రైతులకు అండగా నిలిచిన కథానాయకుడతడు
మాటల్లోనే కాదు సేవారంగంలో కూడా
ఆదర్శంగా నిలిచి స్ఫూర్తిని చాటిన
క్రాంతి వీర్ నానాపటేకర్ కు జోహార్లు..!



**- గోపగాని రవీందర్**
**9440979882**

# కంటైనర్ లారీ ఢీకొని బాలుడు మృతి



**(జోర్దార్ చేవెళ్ల ప్రతినిధి)**
షాబాద్ మండల కేంద్రంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కంటైనర్ లారీ బైకును ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకుల్లో 11 ఏళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు.
తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి.
నాగర్‌గూడకు చెందిన వడ్డే రాజు తన కుమారుడు తనుష్‌తో కలిసిటియస్ 07 జెయం 9975 బైక్‌పై షాబాద్ నుంచి నాగర్‌గూడ వైపు వెళ్తుండగా, తిరుమల వైన్స్ వద్ద ఎదురుగా వస్తున్నటియన్ 88 యం 2085 కంటైనర్ లారీ బైకును ఢీకొట్టింది.
ఈ ప్రమాదంలో తనుష్ లారీ వెనుక చక్రాల కింద పడిపోవ డంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
వడ్డే రాజు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.
ఘటనపై షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలు పాటించాలి



● ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్ఓ డా. అప్పయ్య తనిఖీలు

**హనుమ కొండ జోర్దార్ ప్రతినిధి:** హనుమకొండ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అప్పయ్య గురువారం తనిఖీ చేశారు. యూరోకేర్ హాస్పిటల్, శాంతి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, డా. సుమన్ కిడ్నీ అండ్ ఆండ్రో కేర్ హాస్పిటల్, వేద హాస్పిటల్లను సందర్శించి పరిశుభ్రత, రోగుల భద్రత, వైద్య రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ కింద తప్పని సరిగా నమోదు చేసుకుని నిబంధనల ప్రకారం సేవలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అర్హతలు, అత్యవసర సేవలు, పరికరాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల రికార్డుల విషయంలో నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వైద్య సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా తనిఖీలు, పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివాసీల శాంతియుత నిరసన



**రంపచోడవరం,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో):** షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ గిరిజనేతరుల భూ ఆక్రమణలు, వేధింపులు పెరుగుతున్నాయని, ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చట్టప్రకారం భూములు ఆదివాసీలకు లేదా ప్రభుత్వానికి మాత్రమే చెందుతాయని తెలిపారు. గిరిజనేతరులు ఆక్రమించుకున్న భూములపై ఎల్‌టీఆర్ కోర్టుల్లో కేసులు వేసి పోరాడుతున్న ఆదివాసీలను కొందరు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సాగులో ఉన్న పంటలను దోచుకునేందుకు ప్రయత్నించడంతో పాటు ఎదిరించిన వారిపై దాడులు, ప్రాణ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు.ఎల్‌టీఆర్ పిటిషనర్లపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించిన ఆయన, ఆదివాసీలకు రక్షణ కల్పించి, తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోకపోతే జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు ఏజెన్సీ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, బల్లెం గంగాభవాని, పండా కుమారి, కారం రమణ తదితరులతో పాటు పలువురు ఎల్‌టీఆర్ పిటిషనర్లు, ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతులతో కంది సాగు చేయాలి

● 85 హెక్టార్లలో 207 మంది రైతులకు కంది బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్



**చేవెళ్ల,జోర్దార్ ప్రతినిధి:** మిషన్ ఫర్ ఆత్మనిర్భర్త ఇన్ పల్సెస్ (ఎంఏఎన్‌పీ) 2026--27 కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండలంలోని నారెడ్లగూడ, అంతారం గ్రామాల్లో చేపట్టిన కంది బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్‌ను భోపాల్ పప్పుధాన్యాల అభివృద్ధి డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ డా. ఏ.కె. శివహరే గురువారం పరిశీలించారు.షాబాద్ మండల వ్యవసాయ అధికారి విజయ చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించిన డా. శివహరే రైతులతో మాట్లాడి పంట పరిస్థితి, సాగు విధానాలు, పురుగు నివారణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఆర్థిక నష్టం స్థాయిని బట్టి అవసరమైనప్పుడు మాత్రమే పురుగు మందులను వినియోగించాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులో, సరైన సమయంలో ఇన్‌పుట్‌లను వినియోగించాలని తెలిపారు.మండలంలో 85 హెక్టార్లలో 207 మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా కంది బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్ చేపట్టారు.
ఎల్ఆర్‌జీ-133-33 రకం కంది విత్తనాలను సబ్సిడీపై అందించడంతో పాటు విత్తన శుద్ధి, సమగ్ర పోషక యాజమాన్యం, కలుపు, పురుగు నివారణ వంటి పద్ధతులను అమలు చేస్తున్నారు.
రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ కార్యాలయం జేడీఏ బాలు నాయక్ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో కంది సాగు ద్వారా దిగుబడులు పెంచడంతో పాటు పంట నష్టాలనుతగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, టెక్నికల్ ఏడీఏ పద్మజ, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎఫ్‌పీవో సీఈఓ కందివనం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఓ బి సి ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం పార్లమెంటును ముట్టడిస్తాం

● ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్ కు తరలిన పెద్దపల్లి ఓబిసి శ్రేణులు



**(పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి)** జాతి జన గణాలలో కుల గణన కాలం చేర్చాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్లో జరిగిన ఓ బి సి సమావేశంలో పార్లమెంటు స్త్రశీతాకాల సమావేశాలలో ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు నిర్మించే దశలో ముందుకు రావాలని పార్లమెంటు సభ్యుడు పప్పు యాదవ్ పిలుపునిచ్చారు ఈ సమావేశానికి పెద్ద పెల్లికి చెందిన ఓ బీసీల ప్రతినిధులతో పాటు బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తాడూరి శ్రీమన్నారాయణ శ్రీరాంపూర్ ఎక్స్ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ హాజరయ్యారు.
అణ గారిన వర్గాలకు చెందిన బహుజనులకు దేశ స్వతంత్ర అనంతరం తీవ్రంగా నష్టపోయిన బహుజన వర్గాలకు న్యాయం చేసే వరకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని హాజరైన వక్తలు పార్లమెంట్ సభ్యులు పప్పు యాదవ్ తో పాటు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ఆంధ్రప్రదేశ్ సిపిఐ కార్యదర్శి రామకృష్ణ మరియు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు హరియాన మాజీ ఎంపీ రాజేందర్ కుమార్ ప్రముఖ సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ తెలంగాణ ఆంధ్ర జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గాజుల శ్రీనివాస్ గౌడ్ సంయుక్తంగా పిలుపునిచ్చారు.
శీతాకాలపు పార్లమెంటు సమావేశాల్లో ఢిల్లీని స్తంభింప చేసేలా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నుంచి పదివేల మంది ఓబీసీ కార్యకర్తలను ఢిల్లీకి తరలించి
ఓబీసీ కాలం పెట్టే వరకు పోరాటం చేస్తామని వక్తలు పేర్కొన్నారు

# రామగిరిలో నిఘా పటిష్టం

● సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.80 వేల విరాళం




**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో కీలకంగా మారిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను రామగిరిలో మరింత బలోపేతం చేసేందుకు ఎస్‌సీసీఎల్ ఆర్జీ-3 ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రూ. 80 వేల విరాళం అందజేసింది. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రూ. 80 వేల మొత్తాన్ని రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్‌కు అందజేశారు.
ఈ నిధులతో పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేయకుండా ఉన్న పాత సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది. దొంగతనాలు, ప్రమాదాలు, ఇతర ఘటనలు చోటుచేసుకున్నప్పుడు కెమెరా ఫుటేజీ కీలక ఆధారంగా ఉపయోగపడనుంది. నేరస్తులను గుర్తించడం, కేసుల దర్యాప్తులో ఆధారాలు సేకరించడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించనున్నాయి. పోలీసుల నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సహకరించిన కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులను స్థానికులు అభినందించారు.

# కోనాపురం గ్రామంలో వరుస మోటార్ల చోరీలు






- రెండు నెలల్లో మూడు చోట్ల దొంగతనం.. ఆందోళనలో గ్రామస్తులు

**నర్సంపేట జోర్దార్ ప్రతినిధి:** గ్రామంలో వరుసగా మోటార్లు చోరీకి గురవుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. రెండు నెలల వ్యవధిలో మూడు ప్రాంతాల్లో మోటార్లు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.గ్రామ స్మశానవాటికలో ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌తో పాటు విద్యుత్ వైర్, పైప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని గ్రామ సర్పంచ్ మైదం రాకేష్ తెలిపారు.గతంలోనూ గ్రామంలోని పలు ఆలయాల వద్ద ఇదే తరహాలో మోటార్లు చోరీకి గురైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం పెద్దమ్మతల్లి ఆలయంలో సుమారు రూ.15 వేల విలువైన మోటార్‌తో పాటు ఆలయంలోని గంటను గురుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. నెల రోజుల క్రితం బీరన్న ఆలయంలో సుమారు రూ.10 వేల విలువైన మోటార్ చోరీకి గురైనట్లు చెప్పారు.వరుస చోరీలపై పోలీసులు దృష్టి సారించి, దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బయోమందుల విక్రయాలను కట్టడి చేయరా?

- ఫార్మర్ రిజిస్ట్రీపై ప్రశ్నిస్తే మెమోలంటూ ఆరోపణలు.. రైతుల సమస్యలపై దృష్టి ఎక్కడ?
- ప్రథమ స్థానం కోసం ఒత్తిడి.. క్షేత్రస్థాయి సమస్యలపై అధికారుల్లో అసంతృప్తి
- సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం

**హన్మకొండ జోర్దార్ ప్రతినిధి:** హన్మకొండ జిల్లా వ్యవసాయ శాఖలో బయోమందుల విక్రయాలపై పర్యవేక్షణ ఎంతమేరకు జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతులకు విక్రయిస్తున్న బయోమందుల నాణ్యత, అనుమతులు, విక్రయాల తీరుపై అధికారులు దృష్టి సారించి కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు. ఇదే సమయంలో ఫార్మర్ రిజిస్ట్రీ వ్యవహారం కూడా శాఖలో చర్చనీయాంశంగా మారింది.
ఫార్మర్ రిజిస్ట్రీలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను అధికారుల వాట్సాప్ గ్రూపుల్లో ప్రస్తావించి పరిష్కారం కోరితే మెమోలు జారీ చేస్తున్నారంటూ కొంతమంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యక్రమాన్ని వ్యతిరేకించడం లేదని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తున్నామని వారు చెబుతున్నట్లు తెలుస్తోంది.

**బయోమందులపై చర్యలు ఎప్పుడు?**

రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బయోమందుల విక్రయాలపై వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి తనిఖీలు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.
నాణ్యత ప్రమాణాలు, అనుమతులు, విక్రయించే ఉత్పత్తుల వివరాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశంపై శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన చర్యలు చేప ట్టాలని అంటున్నారు.

**ప్రథమ స్థానం కోసం ఒత్తిడేనా?**

ఫార్మర్ రిజిస్ట్రీలో హన్మకొండ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.
గణాంకాల్లో ప్రగతితో పాటు రిజిస్ట్రీ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.

**ప్రశ్నిస్తే మెమోలేనా?**

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడాన్ని ప్రభుత్వ కార్యక్రమానికి వ్యతిరేకంగా మాట్లాడినట్లుగా చిత్రీకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
దీంతో శాఖలో కొంతమంది అధి కారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.
జిల్లా వ్యవసాయ శాఖలో కొన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నారనే అభిప్రాయంతో తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.
ఫార్మర్ రిజిస్ట్రీ లక్ష్యాలను సాధించడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను వినడం, సాంకేతిక లోపాలను పరిష్కరించడం, బయోమందుల విక్రయాలపై పర్యవేక్షణ పెంచడం ద్వారా రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

# బడి నిధులు కూతురి ఖాతాలోకి... ప్రధానోపాధ్యాయుడి నిర్వాకం!

## ఎంపీపీఎస్ అశోక్ నగర్ లో రూ. 60,500 గోల్ మాల్

- ఉపాధ్యాయ సంఘం మాజీ మండల అధ్యక్షుడే అక్రమాలకు సూత్రధారి?
- ప్రజా ఆర్థిక నిర్వహణ నిబంధనలు గాలికి.. సొంత కూతురే సరఫరాదారు!
- రెండేళ్లుగా బడి మంజూరు నిధులు స్వాహా.. కుర్చీలు లేవు, విద్యుత్ పంకాలు లేవు, మరుగుదొడ్లు అధ్వానం
- బయటపడ్డ బ్యాంకు లావాదేవీలు.. విచారణకు మండల విద్యాధికారి హామీ

**(వరంగల్ /నర్సంపేట జోర్దార్ ప్రతినిధి:)** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయిని పాఠశాల అభివృద్ధికే ఖర్చు చేయాలి. కానీ ఖానాపూర్ మండలంలోని ఎంపీపీఎస్ అశోక్ నగర్‌లో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడే బడి నిధులను తన సొంత కూతురి ఖాతాలోకి మళ్లించుకుని జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి.

**90 మంది విద్యార్థుల నిధులు ఏమయ్యాయి?**

ఈ పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం ప్రభుత్వం ఏటా మిశ్రమ పాఠశాల మంజూరు, క్రీడా మంజూరు, యువజన ఒ పర్యావరణ సంఘం, బడి బాట, భద్రతా మంజూరు నిధులను విడుదల చేస్తుంది. ఈ డబ్బుతో పిల్లలకు కుర్చీలు, విద్యుత్ పంకాలు, మరుగుదొడ్ల మరమ్మత్తు, వంట తోట, భద్రతా సూచన పట్టికలు ఏర్పాటు చేయాలి.కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. పిల్లలు కూర్చోవడానికి సరైన కుర్చీలు లేవు, తిరగని విద్యుత్ పంకాలు, దుర్వాసనతో మరుగుదొడ్లు, ఎక్కడా భద్రతా పట్టిక లేదు, వంట తోట ఊసే లేదు. మరి మంజూరైన నిధులు ఏమయ్యాయి?

**సొంత కూతురే సరఫరాదారు.. లావాదేవీల్లో గోల్ మాల్!**

అసలు గుట్టు ప్రజా ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (పీఎఫ్ఎంఎస్) దస్త్రాలు తీయగానే బయటపడింది. నిబంధనల ప్రకారం ఏదైనా వస్తువు కొంటే దానికి చెల్లింపు రసీదు ఉండాలి, పాఠశాల యాజమాన్య సంఘం తీర్మానం ఉండాలి, అమ్మిన సరఫరాదారు ఖాతాలోకి ఆ వ్యవస్థ ద్వారా నేరుగా డబ్బు వెళ్లాలి.
కానీ ఇక్కడి ప్రధానోపాధ్యాయుడు ఆ నిబంధనలను తుంగలో తొక్కారు. గత రెండేళ్లుగా తన సొంత కూతురినే నకిలీ సరఫరాదారుగా సృష్టించి, రూ. 10,000, రూ. 4,000, రూ. 3,000 చొప్పున విడతల వారీగా మొత్తం రూ. 60,500 వరకు ఆమె వ్యక్తిగత ఖాతాలోకి నేరుగా జమ చేసుకున్నట్లు బ్యాంకు నివేదికలు స్పష్టంగా చెబుతున్నాయి.

**నీతులు చెప్పేవారే అవినీతి చేస్తే ఎలా?**

ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సాధారణ ఉపాధ్యాయుడు కాదు. ఉపాధ్యాయులకు నీతులు చెప్పాల్సిన ఒక ఉపాధ్యాయ సంఘం మాజీ మండల అధ్యక్షుడు.
ఇలాంటి వ్యక్తే విద్యార్థుల నిధులను స్వాహా చేయడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు భగ్గుమంటున్నారు.

**మండల విద్యాధికారి వివరణ:**

ఈ వ్యవహారంపై జోర్దార్ ప్రతినిధి మండల విద్యాధికారి బానోతు వెంకట్రాజము గారిని వివరణ కోరగా, "ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. లావాదేవీలు, చెల్లింపు రసీదులు, పాఠశాల యాజమాన్య సంఘ దస్త్రాలన్నీ పరిశీలించి నిజానిజాలు నిగ్గు తేల్చి కఠిన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.

**విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్:**

**1. ఎంపీపీఎస్ అశోక్ నగర్ ప్రధానోపాధ్యాయుడిపై వెంటనే శాఖాపరమైన విచారణ జరపాలి.**
**2. కూతురి ఖాతాలోకి వెళ్లిన రూ. 60,500 తో పాటు గత రెండేళ్ల మొత్తం మంజూరు నిధుల లెక్క తేల్చాలి.**
**3. నిధులు దుర్వినియోగం అయితే ప్రధానోపాధ్యాయుడిపై నేరపూరిత కేసు నమోదు చేసి తాత్కాలికంగా విధుల నుండి తొలగించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.**

# బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




- అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు
- మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి

**మంథని జోర్దార్ ప్రతినిధి:** బాలికలు తమ హక్కులు, రక్షణకు ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంథని న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలికలకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణ, ఉచిత న్యాయ సేవలు, తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని జడ్జి సూచించారు.
సమస్యలను బయటకు చెప్పేందుకు వెనుకాడకుండా, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి పీ. మంజుల, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ర ఘోత్తం రెడ్డి, రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్, న్యాయవాదులు శశిబూషణ్ కాచే, మంథని శ్రీనివాస్, ఎండీ. షబానా, అశోక్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ అభియాన్ ముగింపు వేడుకల్లో సామూహిక సీమంతాలు

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** హుజురాబాద్ పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాల్లో 9వ పోషణ అభియాన్ ముగింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా గుడి సమీపంలోని అంగన్వాడీ కేంద్రం, నర్సింగాపూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కౌన్సిలర్లు సొల్లు సునీత, దామెర అనూష, పడారి సుమలతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బస్తీ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ జరీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ్యారెడ్డి మాట్లాడుతూ గర్భిణీలు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లితో పాటు పుట్టబోయే శిశువుకు కూడా ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రాశన, సామూహిక సీమంతాలు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమ్యారెడ్డి, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు ప్రతాప జయ, జ్యోతిరాణి, అరుణ, పద్మ, సులోచన, సౌజన్య పాల్గొన్నారు.





# పామాయిల్ రైతులకు యంత్రాలు సబ్సిడీపై ఇవ్వాలి



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):** హుజురాబాద్ నియోజకవర్గంలోని పామాయిల్ తోటల్లో ఎండిపోతున్న మొక్కలపై హార్టికల్చర్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని రైతులు కోరారు. అలాగే కలుపుతీత, గెలల కోత, మల్చింగ్ తదితర పనులకు అవసరమైన స్లాపర్, చాప్ కట్టర్, ష్రెడర్, కట్టర్ తదితర యంత్రాలను సబ్సిడీపై అందరికీ అందించాలని కోరుతూ సాయిల్ ఫ్రైడ్ తెలంగాణ మాజీ చైర్మన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా అధ్యక్షుడు గూడూరి స్వామిరెడ్డి, జీకే రైతు మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి మల్లారెడ్డి, కందుల సమ్మిరెడ్డి, సింతిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కన్ని పోయిన మహేందర్, ఇంద్రసేనారెడ్డితో పాటు ఆయిల్‌ఫామ్ రైతులు పాల్గొన్నారు.

# భారతి విద్యాభవన్ హై స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**(హనుమకొండ జోర్ధార్ ప్రతినిధి)** హన్మకొండ యూనివర్సిటీ విద్యారన్యపురి లోని భారతి విద్యాభవన్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించారు.
ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా ఫ్యాకల్టీ సభ్యులు బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.
కార్యక్రమంలో విద్యా సంస్థ చైర్మన్ తక్కలపల్లి శ్రీదేవి, ప్రిన్సిపల్ బుచ్చి బాబు, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, బతుకమ్మ ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.








# కమలాపూర్‌లో ఘనంగా మెగా కిసాన్ మేళా--2026

**కమలాపూర్,(జోర్దార్ ప్రతినిధి)** రైతుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో ఆర్ఏడబ్ల్యూఈ ఫైనల్ ఇయర్ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు నిర్వహించిన మెగా కిసాన్ మేళా--2026 గురువారం కమలాపూర్ రైతు వేదికలో ఘనంగా జరిగింది.స్మార్ట్ ఫార్మింగ్--సస్టైనబుల్ ఫ్యూచర్’ థీమ్‌తో నిర్వహించిన మేళాకు ముఖ్య అతిథిగా ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రైతు లేకపోతే మన జీవితం లేదన్నారు. యువ వ్యవసాయ విద్యార్థులు క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ఆధునిక సాంకేతికతను వారికి చేరువ చేయాలని సూచించారు.మేళాలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలు, ఇన్నోవేషన్ స్టాళ్లు ఆకట్టుకున్నాయి. స్మార్ట్ ఫార్మింగ్, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. సతీష్, ఏవో వేణు, ఏఈవో రహీం, జిల్లా వ్యవసాయ అధికారి వి. విజయ్ చంద్ర, ఏడీఏ డి. ఆది రెడ్డి, ఏఎంసీ చైర్మన్ టి. ఝాన్సీ రాణి, యూత్ ఐకాన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



# ఆత్మహత్య పరిష్కారం కాదు

## ధైర్యంగా సమస్యలను ఎదుర్కొందాం




**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**పంట నష్టం, అప్పులు, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆదిలాబాద్ జిల్లాలో రైతులు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. గడిచిన మూడు రోజుల్లో ముగ్గురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, ఈ ఏడాది ఇప్పటివరకు 19 మంది బలవన్మరణాలకు పాల్పడినట్లు సమాచారం.
గతేడాది అతివృష్టి, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడులు తగ్గడం రైతుల కష్టాలను మరింత పెంచింది. అయితే ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కష్టాలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుని పరిష్కార మార్గాలను అన్వేషించాలని, పాడిపరిశ్రమ, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

# నేరాలపై ఉక్కుపాదం..

## ప్రజల భద్రతకు పటిష్ట పోలీసింగ్




**జోగుళాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:**జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ టి. శ్రీనివాసరావు ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, బీట్, పెట్రోలింగ్, ట్రాఫిక్ తదితర అంశాలను సమీక్షించారు. గంజాయి, మట్కా, జూదం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రానున్న దేవి నవరాత్రుల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ వై. మొగిలయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**లయన్స్ క్లబ్ ఆఫ్ హుజురాబాద్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు, ఎంఈఓ శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం మంచి సంప్రదాయమని అన్నారు. సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేశ్వర్, కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి శబ్దప్రకాష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్ లో జరుగుతున్న

## జిల్లా కోకో శిక్షణా శిబిరం

**(మహాదేవపూర్ జోర్దార్ ప్రతినిధి)**మహాదేవపూర్ జెడ్ పి హెచ్ ఎస్ గర్ల్స్ పాఠశాల ఆవరణలో పీడీ గుర్సింగ పూర్ణిమ, కురుసం అశోక్ కుమార్ (కోచ్) సీనియర్ ఖో ఖో క్రీడాకారుడు నాయర్ అలీ నేతృత్వంలో జరుగుతున్న అండర్ -19 బాలికల ఖో ఖో శిక్షణ శిబిరం లోని క్రీడాకారిణిలను పరిచయం చేసుకున్న జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ మరియు జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి రిటైర్డ్ ఎంఈఓ శంకరయ్య మరియు ఉపాధ్యాయులు రాజిరెడ్డి,ప్రభాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మడక మధు, కురుసం అనిల్ కుమార్, పశుల శంకర్, తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కోకో శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెడ్పిహెచ్ఎస్ మహాదేవపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడాకారిణిలు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో మన గ్రామీణ ప్రాంతం పాఠశాల నుండి ప్రాతినిధ్యం వహించాలని క్రీడాకారి ణిలకు తెలియజేశారు.

# విద్యుత్ చార్జీల పెంపు వద్దు

- వన్నాల శివాజీ




**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ చార్జీలను మరోసారి పెంచడం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడమేనని హుజురాబాద్ మండల బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ అన్నారు.కూరగాయలు, వంట నూనె, పాలు, విద్య, వైద్యం, రవాణా ఖర్చులు పెరగడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యుత్ చార్జీలు పెరిగితే గృహ వినియోగంతో పాటు వ్యాపార, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై కూడా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చార్జీల పెంపు ప్రతిపాదనను పునరాలోచించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని శివాజీ కోరారు.

# హుజురాబాద్ మండలంలో

## 16 గ్రామాలకు టీబీ రహిత అవార్డులు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ మండలంలోని 16 గ్రామాలను వైద్య ఆరోగ్యశాఖ టీబీ రహిత గ్రామాలుగా గుర్తించి అవార్డులు అందజేసినట్లు ఎంపీడీవో తూర్పాటి సునీత తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయా గ్రామాల సర్పంచులకు అవార్డులు అందించారు.సింగాపూర్, చిన్నపాపయ్యపల్లి, పెద్దపాపయ్యపల్లి, ధర్మరాజుపల్లి గ్రామాలకు రజత అవార్డులు, మరో 12 గ్రామాలకు కాంస్య అవార్డులు లభించాయి. కార్యక్రమంలో డీపీవో జగదీశ్వర్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రాజగోపాల్‌రావు, డీటీసీవో డాక్టర్ హిమబిందు, పలువురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# నాగేంద్రుని లీలలు అంతా ఇంతా కాదయ్యా!

- వందల కోట్ల సీఎంఆర్‌పై అనుమానాలెన్నో.. మిల్లర్లకు అధికారుల అండ?
- నాయకుల ముసుగులో అవినీతి మాఫియా అంటూ ఆరోపణలు.. ప్రజాధనంపై పర్యవేక్షణ ఏదీ?




**(జోర్దార్ హైదరాబాద్ ప్రతినిధి)**తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం తిరిగి ఇవ్వాల్సిన వ్యవస్థలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువైన ధాన్యం, బియ్యం లెక్కల్లో తేడాలు ఎలా వస్తున్నాయి? సీఎంఆర్ బకాయిలు ఎందుకు పేరుకుపోతున్నాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**మిల్లర్ల మాయాజాలం.. అధికారుల మౌనం?**
సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం, మిల్లుల్లో ఉన్న నిల్వలు, ప్రభుత్వానికి తిరిగి అందాల్సిన బియ్యం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని పలువురు కోరుతున్నారు. అయితే కొందరు అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
రికార్డుల్లో ఒక లెక్క.. క్షేత్రస్థాయిలో మరో లెక్క అన్నట్లుగా వ్యవహారం సాగుతుందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్న సందర్భాల్లోనూ తదుపరి చర్యలు ఎలా ఉన్నాయనే దానిపై స్పష్టత రావాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ అండదండలున్నాయా?**
కొంతమంది బడా మిల్లర్లకు రాజకీయ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే అక్రమాలపై అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? ఎవరి పాత్ర ఎంత? అన్నది సమగ్ర విచారణలోనే తేలాల్సి ఉంది.

**ఖజానాకు గండిపడితే బాధ్యత ఎవరిది?**
సీఎంఆర్ వ్యవస్థలో అక్రమాలు జరిగితే దాని భారం చివరకు ప్రభుత్వ ఖజానాపైనే పడుతుంది. కోట్లాది రూపాయల విలువైన ధాన్యం, బియ్యం లెక్కల్లో తేడాలు వస్తే ప్రజాధనానికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అందువల్ల సీఎంఆర్ బకాయిలు, ధాన్యం నిల్వలు, మిల్లుల వారీగా బియ్యం అప్పగింతలపై పారదర్శకంగా వివరాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

**సమగ్ర విచారణతోనే నిజాలు వెలుగులోకి...**
సీఎంఆర్ వ్యవహారంపై క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. మిల్లులకు కేటాయించిన ధాన్యం ఎంత? తిరిగి ప్రభుత్వానికి అందించిన బియ్యం ఎంత? బకాయిలు ఎంత? నిబంధనలు ఉల్లంఘించిన మిల్లులు ఎన్ని? వాటిపై తీసుకున్న చర్యలేమిటి? అనే అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం చేసినట్లు తేలితే సంబంధిత అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.
ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశిస్తే సీఎంఆర్ వ్యవహారంలో దాగి ఉన్న మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

# ఉన్నతాధికారుల ఆదేశాలకు తూట్లు

- కరీంనగర్ పౌరసరఫరాల శాఖలో బడా మిల్లర్ల దందా!
- పెనాల్టీలు చెల్లించని డిఫాల్టర్ మిల్లులకు యథేచ్ఛగా ధాన్యం కేటాయింపులు




**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నిబంధనలను, ఉన్నతాధికారుల స్పష్టమైన ఆదేశాలను కరీంనగర్ జిల్లా అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వ ధాన్యాన్ని గల్లంతు చేసిన బడా రైస్ మిల్లులకు కొమ్ము కాస్తూ మళ్లీ మళ్లీ ధాన్యాన్ని కేటాయిస్తున్న వైనంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు**
రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వల కొరత, అక్రమాలు మరియు టెండర్ల ద్వారా విక్రయించిన ధాన్యం డబ్బులను పూర్తిస్థాయిలో చెల్లించే వరకు డిఫాల్టర్ మిల్లులకు ఎలాంటి ధాన్యం కేటాయించరాదని అప్పటి సివిల్ సప్లయిస్ కమిషనర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.ఎస్. చౌహాన్, ఐ.పి.ఎస్. స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టగా, కొన్ని మిల్లుల్లో భారీగా ధాన్యం కొరత (షార్టేజ్) ఉన్నట్లు తేలింది. నిబంధనల ప్రకారం డిఫాల్టర్ మిల్లులపై క్రిమినల్ చర్యలతో పాటు, 25% పెనాల్టీతో కూడిన రికవరీ ప్రొసీడింగ్స్ చేపట్టాలని మరియు తదుపరి ధాన్యం కేటాయింపులను పూర్తిగా నిలిపివేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అయితే, కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మాత్రం ఈ నిబంధనలను బుట్టదాఖలు చేశారు. బడా రైస్ మిల్లుల యజమానులతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, కమిషనర్ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అక్రమంగా ధాన్యం కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. వాస్తవానికి ఆయా మిల్లుల వద్ద ప్రస్తుతం తగినంత ధాన్యం నిల్వలు లేకపోయినప్పటికీ, అధికారులు వారికి దాసోహం అంటూ ప్రభుత్వ సంపదను యథేచ్ఛగా దోచిపెడుతున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి.

**ఈ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయింపులు పొందినట్లు మరియు వివాద ంలో ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన కరీ ంనగర్ జిల్లాలోని ప్రముఖ రైస్ మిల్లుల జాబితా:**
వరలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్, చిట్యాలపల్లి,శ్రీ రాజరాజేశ్వర పీబీఆర్ఎం, తాడికల్,వెంకటేశ్వర ఎంఆర్ఎం, తిమ్మాపూర్,శ్రీ శ్రీదేవి ఇండస్ట్రీస్, జమ్మికుంట,నీరజాక్షి ఇండస్ట్రీస్, చొప్పదండి ఆర్.కె. ఇండస్ట్రీస్, రేణికుంట,శ్రీ వీరభద్ర ఇండస్ట్రీస్, మానకొండూర్,సప్తగిరి ఇండస్ట్రీస్, జమ్మికుంట,శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ అండ్ కో ఆదిత్య, గోపాల్‌పూర్,హరిప్రియ ఇండస్ట్రీస్, చొప్పదండి,లక్ష్మీ పీబీఆర్ఎం, మానకొండూర్ ఎస్.ఆర్. ట్రేడర్స్, రంగపూర్,మహాశక్తి ఆగ్రో ఇండస్ట్రీస్, కొరపల్లి,శ్రీ సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీరాములపల్లి,చిన్న మిల్లులపై తీవ్ర వేధింపులు,ఒకవైపు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ బడా మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులు, నిబంధనలకు లోబడి నిజాయితీగా పనిచేస్తున్న చిన్న చిన్న రైస్ మిల్లుల యజమానులను మాత్రం రకరకాల సాకులతో వేధింపులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, కరీంనగర్ జిల్లా శాఖలో జరుగుతున్న ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులపై మరియు నిబంధనలు ఉల్లంఘించిన మిల్లులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు, మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

# రహదారే పార్కింగ్ స్థలమా..?

- చల్లూరు-మల్లారెడ్డిపల్లి మార్గంలో ఇసుక లారీలతో తీవ్ర ఇబ్బందులు
- రాకపోకలకు ఆటంకం..
- పాఠశాల వాహనాలు, చిన్నారుల భద్రతపై ఆందోళన
- ప్రమాదం జరిగాక మేల్కొంటారా..? అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



**(కరీంనగర్/వీణవంక జోర్దార్ ప్రతినిధి)**ప్రజల రాకపోకల కోసం నిర్మించిన ప్రధాన రహదారి.. ఇసుక లారీల పార్కింగ్ స్థలంగా మారడంతో చల్లూరు-మల్లారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
మల్లారెడ్డిపల్లి ఇసుక క్వారీ వద్ద లారీలకు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో భారీ వాహనాలను ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
దీంతో రహదారి ఇరుకుగా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం సురక్షితంగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.
నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, రైతులు, ప్రయాణికులతో పాటు పాఠశాల వాహనాలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ముఖ్యంగా పాఠశాల సమయాల్లో రహదారిపై భారీ వాహనాలు నిలిచి ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదం జరిగితేనే చర్యలా..?**
ఇప్పటికే ఇదే పరిస్థితుల్లో సండి రాజు అనే జేసీబీ డ్రైవర్ లారీ ప్రమాదానికి గురైన ఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. అయినప్పటికీ రహదారిపై లారీల నిలిపివేత కొనసాగుతుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
"ముందు జాగ్రత్తే మేలు" అన్న సామెతను అధికారులు గుర్తించి, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరు తున్నారు.

**రహదారిపై లారీలు.. ప్రజలకు అవస్థలు**
క్వారీ నిర్వాహకులు లారీల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకుండా ప్రధాన రహదారిపైనే వాహనాలను నిలిపివేస్తుండటంతో ప్రజలకు నిత్య అవస్థలు తప్పడం లేదు. ఒకవైపు ఇరుకైన రహదారి.. మరోవైపు భారీ లారీలు నిలిచిపోవడంతో సాధారణ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.
"చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే పరిస్థితి రాకముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి**
సంబంధిత అధికారులు వెంటనే చల్లూరు--మల్లారెడ్డిపల్లి ప్రధాన రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, రహదారిపై లారీల పార్కింగ్‌ను నియంత్రించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.
క్వారీ నిర్వాహకులకు స్పష్టమైన నిబంధనలు విధించి, లారీల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
ప్రజల ప్రాణ భద్రతతో ముడిపడిన అంశంలో "ఆలస్యం అమృతం విషం" అన్నట్లుగా వ్యవహరించకుండా అధికారులు తక్షణమే స్పందించాలని మల్లారెడ్డిపల్లి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.
పాఠశాల చిన్నారులు, ప్రయాణికులు, రైతుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి రహదారిపై లారీల నిలిపివేతకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# ఆ ఊళ్లో వరుస మరణాలు కీడు సోకిందని ఊరు ఖాళీ!

- చేతబడి చేశారా..? అంటూ గ్రామస్థుల అనుమానం
- ఏఐ యుగంలోనూ అనాగరిక ఆచారం.. మూకుమ్మడిగా వనభోజనాలకు వెళ్లిన గ్రామస్థులు

**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:**ఆధునిక సాంకేతికత పరుగులు పెడుతున్న కాలంలోనూ కొన్ని గ్రామాల్లో మూఢనమ్మకాలు, సంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో గత రెండు, మూడు నెలలుగా సుమారు 13 మంది వివిధ కారణాలతో మృతిచెందడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. వరుస మరణాలకు కారణమేంటన్న దానిపై గ్రామస్తుల్లో చర్చ మొదలైంది.

**కీడు సోకిందని.. ఊరంతా ఒక్కటైంది!**
వరుస మరణాలతో ఆందోళనకు గురైన గ్రామస్తులు సమావేశమై గ్రామానికి ఏదో కీడు సోకిందన్న నమ్మకానికి వచ్చారు. కొందరు గ్రామానికి చేతబడి చేశారేమోనన్న అనుమానాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో గ్రామానికి కీడు తొలగిపోవాలనే నమ్మకంతో గురువారం గ్రామస్తులంతా కలిసి ఊరు విడిచి వనభోజనాలకు వెళ్లారు.ఉదయం 6 గంటల సమయంలో గ్రామం నుంచి బయలుదేరిన గ్రామస్థులు సాయంత్రం 6 గంటలకు తిరిగి గ్రామానికి చేరుకునేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఒకేసారి గ్రామం మొత్తం ఖాళీ కావడంతో కనుకులలో అసాధారణ నిశ్శబ్దం నెలకొంది.

**పోలీసుల బందోబస్తు**
గ్రామస్థులంతా ఊరు విడిచి వెళ్లిన విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.
వరుస మరణాలకు అసలు కారణాలపై వైద్యపరమైన, శాస్త్రీయమైన పరిశీలన అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామస్తుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.
ఏదేమైనా ఏఐ సాంకేతికతతో ప్రపంచం దూసుకుపోతున్న ప్రస్తుత కాలంలో ఒక గ్రామం మొత్తం కీడు తొలగిపోతుందన్న నమ్మకంతో ఊరు విడిచి వనభోజనాలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

# మహిళ అదృశ్యం

## నగదు, వెండి తీసుకెళ్లినట్లు ఫిర్యాదు



**జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి:**జమ్మికుంట గ్రామానికి చెందిన రేవెల్లి తిరుపతి (36) తన భార్య రేవెల్లి దేవిక అలియాస్ రాణి (28) అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. అక్టోబర్ 6న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో తిరుపతి ఇంట్లో నిద్రిస్తుండగా, ఆయన భార్య దేవిక ఇంట్లోని అల్మారాలో ఉన్న రూ.2 వేల నగదు, మూడు తులాల వెండి, దుస్తులు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. నిద్రలేచి చూసేసరికి భార్య ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY
తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# గ్రూప్ దశ తర్వాతే అసలు ఆట.. వరల్డ్‌కప్‌లో 'సూపర్-7'



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రతిష్టాత్మక వన్డే వరల్డ్‌కప్ 2027 షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ టోర్నమెంట్‌ను మరింత ఉత్కంఠగా మార్చేందుకు ఐసీసీ పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా సెమీఫైనల్స్ ఆడే ముందు సరికొత్తగా సూపర్-7 స్టేజ్‌ను ప్రవేశపెట్టి క్రికెట్ అభిమానులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. గతంలో గ్రూప్ దశ ముగిసిన వెంటనే నేరుగా సెమీఫైనల్స్ జరిగేవి. కానీ ఈసారి ఆ పద్ధతిలో మార్పు చేసి జట్ల మధ్య పోటీని మరింత రసవత్తరంగా మార్చాలని ఐసీసీ నిర్ణయించింది. ఈ కొత్త ఫార్మాట్ ద్వారా టోర్నమెంట్‌లో ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంటుందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు.ఏమిటి ఈ సూపర్-7 స్టేజ్.. ఎలా పనిచేస్తుంది?2027 వన్డే వరల్డ్‌కప్‌లో మొత్తం 12 జట్లను ఆరు చొప్పున రెండు వేర్వేరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-ఏలో భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, జింబాబ్వేతో పాటు ఒక క్వాలిఫైయర్ జట్టు ఉన్నాయి. అలాగే గ్రూప్-బీలో సౌతాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌తో పాటు మరో క్వాలిఫైయర్ జట్టు ఉన్నాయి. గ్రూప్ దశ ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ నుంచి టాప్-3 జట్లు నేరుగా సూపర్-7 స్టేజ్‌కు అర్హత సాధిస్తాయి. ఇక ఏడవ జట్టు కోసం రెండు గ్రూప్‌లలో నాల్గో స్థానంలో నిలిచిన జట్ల మధ్య పాయింట్లు, విజయాలు, నెట్ రన్ రేట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు.

సూపర్-7 ప్రత్యేకతలు, కొత్త నిబంధనలు

ఈ సూపర్-7 స్టేజ్‌లోకి ప్రవేశించిన తర్వాత అన్ని జట్లకు సరికొత్త ఆరంభం లభిస్తుంది. గ్రూప్ దశలో సాధించిన పాయింట్లతో ఎలాంటి సంబంధం లేకుండా, పట్టిక సున్నా నుంచి మళ్లీ మొదలవుతుంది. ఈ రౌండ్‌లో ప్రతి జట్టు మిగతా జట్లతో రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడాల్సి ఉంటుంది. అంటే ప్రతి జట్టు మొత్తం 6 మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ దశలో మొత్తం 21 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాప్-4 స్థానాల్లో నిలిచిన జట్లు మాత్రమే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ప్రీ-సీడెడ్ నిబంధనల ప్రకారం మ్యాచ్‌ల షెడ్యూల్ ముందే స్పష్టత ఇవ్వడం వల్ల అభిమానులకు ఎలాంటి గందరగోళం ఉండదు.కనీసం రెండు సార్లు భారత్ -- పాకిస్థాన్ పోరుఐసీసీ ప్రవేశపెట్టిన ఈ కొత్త సూపర్-7 ఫార్మాట్ కారణంగా క్రికెట్ లవర్లకు అత్యంత ఇష్టమైన భారత్ -- పాకిస్థాన్ మ్యాచ్‌లు కనీసం రెండు సార్లు చూడటానికి వీలవుతుంది. షెడ్యూల్ ప్రకారం గ్రూప్ దశలో ఇరు జట్లు ఇప్పటికే ఒకసారికీ పైగా తలపడనుండగా, ఇప్పుడు సూపర్-7 స్టేజ్‌లో కూడా భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరో హైవోల్టేజ్ మ్యాచ్ ఖాయమైంది. ఒకవేళ నాకౌట్ దశలైన సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో కూడా ఈ రెండు జట్లు తలపడితే, అభిమానులకు మూడోసారి కూడా ఈ చిరకాల



# అంతర్జాతీయ వేదికపై చరిత్ర సృష్టించిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ

భారతీయ క్రికెట్ రంగానికి చెందిన టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనతను సాధించాడు. కేవలం 15 సంవత్సరాల వయసులోనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఈ కుర్రాడు, ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ ప్రకటించిన ౧×వీజు100 చీవష్ జాబితాలో స్థానం సంపాదించుక౧న్నాడు. భవిష్యత్తును తీర్చిదిద్దే వర్ధమాన తారల జాబితాలో ప్రపంచం నలుమూలల నుంచి ఎంపిక చేసిన ఏడుగురు అథ్లెట్లలో వైభవ్ ఒకడిగా నిలిచాడు. విశేషం ఏంటంటే ఈ ప్రతిష్టాత్మక జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక క్రికెటర్ అలాగే ఏకైక భారతీయుడు కూడా వైభవ్ కావడం గమనార్హం. ఆయన ప్రతిభను గుర్తించిన టైమ్ మ్యాగజైన్ ఫినోమ్ కేటగిరీలో చేర్చి, ప్రపంచ క్రీడా రంగంలో అత్యంత ఆకర్షణీయమైన శక్తిగా మారుతున్నాడని ప్రశంసించింది.

వైభవ్ సూర్యవంశీతో పాటు ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ జాబితాలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మరో ఆరుగురు యువ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. వారిలో అమెరికన్ కాలేజ్ ఫుట్‌బాల్ క్వార్టర్ బ్యాక్ ఆర్చ్ మానింగ్, ఎన్బీఏ స్టార్ టైరీస్ మాక్సీ, అమెరికా మహిళల సాకర్ జట్టు డిఫెండర్ నవోమి గిర్మా ఉన్నారు. అలాగే ఫిలిప్పీన్స్ టెన్నిస్ క్రీడాకారిణి అలెగ్జాండ్రా ఈలా, అమెరికా పురుషుల సాకర్ ఆటగాడు ఫోలారిన్ బలోగున్, డబ్ల్యూఎన్బీఏ గార్డ్ ఒలివియా మైల్స్ కూడా ఈ జాబితాలో వైభవ్‌తో పాటు స్థానం పొందారు. వీరందరితో పాటు భారత్ తరఫున వైభవ్ ఒక్కడే ఈ జాబితాలో నిలవడం మన దేశానికి గర్వకారణం.వైభవ్ చిన్న వయసులోనే క్రికెట్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తూ వచ్చాడు. 2024లో బీహార్ తరఫున రంజీ ట్రోఫీ ద్వారా ఫస్ట్-క్లాస్ అరంగేట్రం చేసినప్పుడు ఆయన వయసు కేవలం 12 సంవత్సరాలే కావడం విశేషం. ఆ తర్వాత ఐపీఎల్ మెగా టోర్నీలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రూ.కోటికి ఈ యువ ఆటగాడిని దక్కించుకుంది. అరంగేట్రం చేసిన తొలి ఐపీఎల్ సీజన్‌లోనే కేవలం ఏడు మ్యాచ్‌లు ఆడి అద్భుతమైన సెంచరీ బాది

## న్యూజిలాండ్‌కు రెండు వన్డే జట్లు.. బీసీసీఐ ప్లాన్స్ అదుర్స్..

ఈ రెండు సిరీస్‌ల జట్లను అక్టోబర్ 11 తర్వాత ఎంపిక చేస్తారు. ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వన్డే సిరీస్‌ల కోసం బీసీసీఐ రెండు వేర్వేరు వన్డే జట్లను ఎంపిక న్యూజిలాండ్‌కు 2 వన్డే జట్లు..

భారత్, న్యూజిలాండ్ మధ్య టీ20ఐ సిరీస్ అక్టోబర్ 22న ప్రారంభం కానుంది. దీంతో భారత్ 40 రోజుల న్యూజిలాండ్ పర్యటన మొదలవుతుంది. ఈ సిరీస్‌లో ఐదు యోచిస్తున్నట్లు నివేదిక చెబుతోంది. వన్డే సిరీస్‌కు, టెస్ట్ సిరీస్‌కు మధ్య కేవలం నాలుగు రోజుల విరామం మాత్రమే ఉంది. అందువల్ల, టెస్ట్ సిరీస్‌కు సిద్ధమయ్యేందుకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లకు చివరి రెండు వన్డేల నుంచి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉందిగత 2 మ్యాచ్‌లకు వేరే జట్టు.. అందుకే వన్డే సిరీస్ కోసం సెలెక్టర్లు రెండు జట్లను ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఈ



వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను పూర్తి చేసిన తర్వాత , టీమ్ ఇండియా న్యూజిలాండ్‌కు బయలుదేరనుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పర్యటన, 2020 తర్వాత అన్ని ఫార్మాట్లలో సిరీస్ కోసం భారత జట్టు న్యూజిలాండ్‌కు వెళ్లడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన టీ20 సిరీస్‌తో ప్రారంభమై, ఆ తర్వాత వన్డే, టెస్ట్ సిరీస్‌లు జరగనున్నాయి. టీ20 సిరీస్ కోసం జట్టును ఇప్పటికే ప్రకటించారు. కానీ వన్డే, టెస్ట్ సిరీస్‌ల జట్లను ఇంకా ప్రకటించాల్సి ఉంది. నివేదికల ప్రకారం, టీ20ఐలతో పాటు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు కూడా ఆడతారు. టీ20ఐ సిరీస్ కోసం జట్టును ఇప్పటికే ఎంపిక చేయగా, వన్డే, టెస్ట్ జట్లను త్వరలో ఎంపిక చేయనున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, వన్డే జట్టు ఎంపికలో జాప్యానికి గల కారణాలలో ఒకటి, ప్రస్తుతం ఇండియా 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' మధ్య జరుగుతున్న వన్డే సిరీస్.

వాస్తవానికి, వన్డే సిరీస్ కోసం రెండు వేర్వేరు జట్లను ఎంపిక చేయాలని సెలక్షన్ కమిటీ నిర్ణయంలో ఇండియా 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' మధ్య జరుగుతున్న సిరీస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సిరీస్‌లో పాల్గొనే ఆటగాళ్లను సెలక్షన్ కమిటీ నిశితంగా పరిశీలిస్తుంది. వారిలో కొందరిని ఈ రెండవ జట్టుకు ఎంపిక చేస్తుంది. ఈ జట్టు చివరి రెండు వన్డేలు ఆడుతుంది. రుతురాజ్ గైక్వాడ్, సూర్యాంశ్ షెడ్గే, రజత్ పాటిదార్, యశ్ ఠాకూర్, విప్రజ్ నిగమ్ వంటి ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కవచ్చు.

# అలర్ట్.. తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసా..



ఎప్పటికప్పుడు.. బంగారం, వెండి ధరల్లో ఊహించని చోటుచేసుకుంటున్నాయి.. వాస్తవానికి బులియన్ మార్కెట్లో ఒక్కోసారి బంగారం ధర పెరిగితే.. మరికొన్నిసార్లు తగ్గుతూ వస్తుంటాయి.. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ పరిస్థితులు.. అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు మార్కెట్ ధరలపై ప్రభావం చూపుతున్నాయని.. మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా గురువారం అక్టోబర్ 8 ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ10 మేర తగ్గి.. రూ.1,49,560 గా ఉంది.22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర 10 తగ్గి.. రూ.1,37,090 గా ఉంది.వెండి కిలో ధరపై రూ.100 మేర తగ్గి.. రూ.2,34,900 లుగా కొనసాగుతోంది.అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.ప్రధాన నగరల్లో ధరలు..హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,560, 22 క్యారెట్ల ధర రూ.1,37,090 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,560 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,37,090 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,690, 22 క్యారెట్ల ధర రూ.1,37,240 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 గా కొనసాగుతోంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,560, 22 క్యారెట్ల ధర రూ.1,37,090 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,580, 22 క్యారెట్ల ధర రూ.1,37,110 ఉంది. వెండి కిలో ధర రూ.2,44,900 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రా ధర రూ.1,49,560, 22 క్యారెట్ల ధర రూ.1,37,090 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# బ్యాంక్ ఖాతాదారులకు బిగ్ రిలీఫ్.. అక్టోబర్ 15 నుంచి ఇబ్బందే ఉండదు.. ఏటీఎంల ద్వారా..





యూపీఐ చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. రూ.2000కు మించిన యూపీఐ ట్రాన్సాక్షన్‌లపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) ఛార్జీలను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. మీరు మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు లేదా ఇతర వ్యక్తులకు ఎంత మొత్తం పంపినా ఎలాంటి ఛార్జీలు ఉండవు. ఈ కొత్త నిబంధనలు కేవలం రిజిస్టర్డ్ వ్యాపారులకు (మర్చెంట్లకు) యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తాయి. మీరు ఒక షాపులో వస్తువులు కొని యూపీఐ ద్వారా చెల్లింపు చేస్తే..ఆ వ్యాపారి ఖాతా నుండి బ్యాంకులు ఎండిఆర్. ఛార్జీలను వసూలు చేస్తాయి. ఈ చార్జీలను బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు వ్యాపారుల నుండి వసూలు చేస్తారు. యూపీఐ ద్వారా జరిగే రూ2000పైన ఉన్న చెల్లింపులకు ఈ ఛార్జీ 0.4 శాతంగా కేంద్రం నిర్ణయించింది. ఈ ఛార్జీలు వ్యాపారుల ఖాతాల నుండి నేరుగా తీసివేస్తారు. చిన్న వ్యాపారులు, తమ వ్యాపారాన్ని యూపీఐ ద్వారా రిజిస్టర్ చేసుకున్నవారిని ఇవి ప్రభావితం చేయనున్నారు. వారు తమ లావాదేవీలపై పడే ఛార్జీల గురించి అవగాహన కలిగి ఉండాలి.అయితే కొన్ని ప్రత్యేక రంగాలకు ఈ 0.4 శాతం ఛార్జ్ వర్తించదు. రైల్వే టిక్కెట్లు, టెలికాం బిల్లులు, బీమా ప్రీమియంలు, ఇంధన కొనుగోళ్లు వంటి సేవలకు యూపీఐ ద్వారా ఎంత మొత్తం చెల్లించినా కేవలం స్థిరంగా రూ.5 మాత్రమే ఛార్జీగా వసూలు చేస్తారు. ఉదాహరణకు మీరు రూ.75,000 విలువైన బీమా ప్రీమియంను యూపీఐ ద్వారా చెల్లిస్తే.. వ్యాపారికి కేవలం రూ.5 మాత్రమే ఛార్జ్ పడుతుంది. ఆన్‌లైన్ చెల్లింపుల విషయంలో మీరు ఏదైనా వ్యాపార సంస్థకు యూపీఐ ద్వారా చెల్లింపు చేసినా, ఆ ఛార్జ్ సంబంధిత వ్యాపార సంస్థకు వర్తిస్తుంది. వినియోగదారులు మాత్రం ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా యూపీఐ సేవలను యథావిధిగా ఉపయోగించుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలను డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో పారదర్శకతను, స్థిరత్వాన్ని పెంచే లక్ష్యంతో కేంద్రం తీసుకొచ్చింది.అయితే యూపీఐ ఛార్జీలపై వ్యాపారులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తిరిగి క్యాష్ పేమెంట్ల వైపు మొగ్గు చూపే అవకాశముంది. ఈ క్రమంలో ఆర్బీఐ అప్రమత్తమైంది. అక్టోబర్ 15 నుంచి ఏటీఎంలలో తగినంత నగదు లభ్యత ఉండేలా చూడాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులను ఆదేశించాయి. ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు వ్యాపారులు

# బిగ్ బ్రేకింగ్.. కొత్త వడ్డీ రేట్లు ప్రకటించిన ఆర్బీఐ..

వడ్డీ రేట్లపై ఆర్బీఐ బిగ్ అనౌన్స్‌మెంట్ చేసింది. వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర పెంచుతున్నట్లు ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉండగా.. ఇప్పుడు 5.50 శాతానికి చేర్చింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీన ఆర్బీఐ ద్రవ్య విధాన పరపతి సమావేశాలు నిర్వహించారు. ఈ మీటింగ్‌లో రెపో రేట్లపై చర్చించిన అనంతరం ఈ ప్రకటన జారీ చేశారు. వడ్డీ రేట్లను ఆర్బీఐ పెంచనుందని గత కొద్ది కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. పలు ఏజెన్సీలు, బిజినెస్ అనలిస్టులు కూడా రెపో రేటు పెంచే అవకాశముందని అంచనాలు వేశారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, ఆర్థిక వ్యవస్థపై ఎల్‌నివో ప్రభావం క్రమంలో ఆర్బీఐ వడ్డీ రేట్లను ఎలా ఉంచుతుందనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. దీంతో ఆర్బీఐ ప్రకటన కోసం ఎదురుచూశారు. ఇప్పుడు ఎట్టకేలకు ఆర్బీఐ నుంచి ప్రకటన వచ్చింది. ఊహించినదే జరిగింది..ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచనుందని గత కొద్ది రోజులుగా వార్తలు



వస్తున్నాయి. ఇప్పుడు అందరూ అనుకున్నదే జరిగింది. వడ్డీ రేట్లను ఆర్బీఐ పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆర్బీఐ ప్రకటనతో స?క్ మార్కెట్లు కుప్పకూలాయి. 400 పాయింట్లకు పైగా నష్టంతో సెన్సెక్స్ కొనసాగుతుండగా.. నిఫ్టీ 170 పాయింట్లకుపైగా నష్టంతో కొనసాగుతోంది. రూపాయి మారకపు విలువ 10 పైసలు క్షీణించింది. రెపో రేరటు పెంపుతో ఈఎంఐలు కడుతున్నవారిపై భారం పడనుంది. ఫ్లోటింగ్ వడ్డీ రేటు ప్రకారం లోన్లు తీసుకున్నవారికి ఈఎంఐలు పెరగనున్నాయి. అలాగే కొత్తగా లోన్లు తీసుకోవాలన్నా అధిక వడ్డీ రేట్లు పడతాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసినవారికి, కొత్త ఎఫ్‌డీ చేసేవారికి మాత్రం దీని వల్ల లాభం జరగనుంది. వడ్డీ రేట్లు పెరగడం వల్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల వల్ల అధిక ఆదాయం లభిస్తుంది. కొంతమందికి నష్టం జరగనుండగా.. మరికొంతమందికి రెపో రేటు పెంపు వల్ల లాభం జరగనుందని చెప్పవచ్చు.మరింత పెరుగుతాయా..?

అయితే ఆర్బీఐ రెపో రేటును రానున్న రోజుల్లో మరింత పెంచే అవకాశముందని తెలుస్తోంది. విడతల వారీగా వడ్డీ రేట్లను ఆర్బీఐ పెంచనుందని సమాచారం. వచ్చే సమావేశంలో మరో 25 బేసిస్ పాయింట్లు పెంచే ఛాన్స్ ఉండగా.. విడతల వారీగా 125 బేసిస్ పాయింట్ల మేర పెంచనుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2023లో ఆర్బీ వడ్డీ రేట్లను పెంచగా.. 2025లో తగ్గించింది. మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచింది.

# బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్లాలంటే ఈ టెస్టులు క్లియర్ చేయాల్సిందే.



బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టాలంటే సామాన్యులకు అగ్ని పరీక్ష కాంటెస్ట్ ఉంది.

మరి సెలబ్రిటీలకు ఎలాంటి టెస్టులు ఉండవా? అంటే కచ్చితంగా ఉంటాయంటోంది మాజీ కంటెస్టెంట్ దివి. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఆమె బిగ్ బాస్ షో గురించి పలు ఆసక్తికర విషయాలు బయట పెట్టింది.బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా, ఆసక్తికరంగా సాగుతోంది. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ రియాలిటీ షో ఇప్పటికే విజయవంతంగా నాలుగు వారాలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు ఐదో వారం కూడా కొనసాగుతోంది. ప్రస్తుతం బిగ్ బాస్ హౌస్ లో సెలబ్రిటీలతో పాటు కామనర్స్ కూడా ఉన్నారు. బిగ్ బాస్ అగ్ని పరీక్ష సీజన్ 2 ద్వారా కామనర్స్ హౌస్ లోకి అడుగు పెట్టారు. .మరి మరి బిగ్ బాస్ హౌస్ లోకి రావాలంటే సెలబ్రిటీలకు కూడా టెస్టులు ఉంటాయా? ఉంటే ఎలాంటి టెస్టులు ఉంటాయి? అని చాలా మంది ఆలోచిస్తుంటారు. అయితే బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టాలంటే సెలబ్రిటీలకు కూడా కొన్ని టెస్టులు ఉంటాయని, ఆ టెస్టు పాస్ అయితేనే వారిని హౌస్ లోకి పంపిస్తారని బిగ్ బాస్ వెనుక నిజాలను బయటపెట్టింది మాజీ కంటెస్టెంట్, ప్రముఖ నటి దివి. బిగ్ బాస్ తెలుగు సీజన్ 4లో పాల్గొన్న ఆమె తన ఆట, మాట తీరుతో అందరి దృష్టిని ఆకర్షించింది. విజేతగా నిలవకపోయినా తన ముక్కుసూటితనంతో బిగ్ బాస్ ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. తాజాగా ఓ ఛాట్ షోకు హాజరైన ఆమె బిగ్ బాస్ రియాలిటీ షో గురించి, అందులో తన ప్రయాణం, ఆ తర్వాత కెరీర్ పరంగా వచ్చిన మార్పులపై పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. అందులో భాగంగానే బిగ్ బాస్ లోకి వెళ్లే ముందు ఏం అడిగారు? ఏ ఏ టెస్టులు ఉంటాయి ? అనే విషయాలపై ఫుల్ క్లారిటీ ఇచ్చింది దివి.న్ ఎలా ఉంది? అనే విషయాన్ని కూడా చూస్తారు. ముఖ్యంగా బీపీ, షుగర్ తో పాటు మెంటల్ టెస్ట్ కూడా చేస్తారు. మీరు హౌస్ లోకి వెళ్లిన తర్వాత ఏదైనా గొడవ పెట్టుకుంటారా? లేక స్టేబుల్ గా ఉంటారా? లేదా మరేదైనా అనారోగ్య సమస్య వస్తుందా ? అనే విషయాలన్నింటినీ ముందుగా చెక్ చేస్తారు. ఈ టెస్టులన్నీ క్లియర్ చేసిన తర్వాతే బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ దొరుకుతుంది' అని చెప్పుకొచ్చింది దివి. ప్రస్తుతం

' మొదట కొన్ని ఫొటోలు చూశారు. ఆ తర్వాత ఒక మూడు, నాలుగు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీడియో కాల్ లో ముగ్గురు, నలుగురు ఒకేసారి మాట్లాడుతారు. అది కాకుండా మళ్లీ ఒక డాక్టర్ మనతో ప్రత్యేకంగా మాట్లాడతారు. మన మెంటల్ కండిషన్ ఎలా ఉంది ? అనే విషయం చూస్తారు. ఆ తర్వాత ఫిజికల్ గా బాడీ టెస్టులు కూడా జరుగుతాయి. మన హెల్త్ కండిషన్ ఎలా ఉంది? అనే విషయాన్ని కూడా చూస్తారు. ముఖ్యంగా బీపీ, షుగర్ తో పాటు మెంటల్ టెస్ట్ కూడా చేస్తారు. మీరు హౌస్ లోకి వెళ్లిన తర్వాత ఏదైనా గొడవ పెట్టుకుంటారా? లేక స్టేబుల్ గా ఉంటారా? లేదా మరేదైనా అనారోగ్య సమస్య వస్తుందా ? అనే విషయాలన్నింటినీ ముందుగా చెక్ చేస్తారు. ఈ టెస్టులన్నీ క్లియర్ చేసిన తర్వాతే బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ దొరుకుతుంది' అని చెప్పుకొచ్చింది దివి. ప్రస్తుతం ఈ బిగ్ బాస్ బ్యూటీ చెప్పిన మాటలు నెట్టింట వైరల్ గా మారాయి. బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్లాలంటే ఇన్ని టెస్టులు పాస్ అవ్వాలా? అంటూ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.

# ఓవరాక్షన్, క్రింజ్ అన్నా నేను వాటిని పట్టించుకోను..!



టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్లలో ఒకటైన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా రణబాలి విడుదలకు సిద్ధమవుతుంది. నేపథ్యంలో ప్రస్తుతం ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. దసరా కానుకగా ఈ నెల 16న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూలు, ఈవెంట్లతో సినిమాపై అంచనాలు పెంచే ప్రయత్నం చేస్తోంది.అయితే సినిమా ప్రమోషన్స్ కంటే విజయ్, రష్మికల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధానికి సంబంధించిన విషయాలే ఎక్కువగా చర్చకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రష్మిక ప్రమోషన్ ఈవెంట్లలో ఎంతో సరదాగా, ఉత్సాహంగా కనిపించడం కొందరు నెటిజన్లకు నచ్చకపోవడంతో సోషల్ మీడియాలో ఆమెపై ట్రోలింగ్ కూడా జరుగుతోంది.తాజా ఇంటర్వ్యూలో ఇదే విషయంపై రష్మికకు ప్రశ్న ఎదురవగా.. ఆమె ఎలాంటి మొహమాటం లేకుండా తన అభిప్రాయాన్ని తెలిపింది. తాను ఎక్కడ ఉన్నా అక్కడి వాతావరణాన్ని సంతోషంగా ఉంచాలని కోరుకుంటానని చెప్పుకొచ్చింది

# ది ప్యారడైజ్ ఎఫెక్ట్.. చిరంజీవి సినిమా ఆగిపోయిందా..?



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఆశించిన స్థాయిలో సినిమా మెప్పించలేకపోవడంతో ఈ మూవీపై మిక్స్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా అదిరిపోయింది అంటుంటే మరికొంతమంది మాత్రం సినిమా అంతగా లేదు అంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా ఫలితం ప్రభావం దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తదుపరి ప్రాజెక్టులపై పడిందంటూ సోషల్ మీడియాలో రకాల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఇదే సమయంలో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కాల్సిన సినిమా కూడా ఆగిపోయిందనే ప్రచారం ఊపందుకుంది. అయితే తాజాగా ఈ రూమర్స్‌పై హీరో నాని స్పందించాడు. 'ది ప్యారడైజ్' విడుదల తర్వాత తొలిసారి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని.. సినిమా రిజల్ట్, శ్రీకాంత్ ఓదెల టాలెంట్, అలాగే చిరంజీవి ప్రాజెక్ట్ పై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ది ప్యారడైజ్ అండర్‌ఫెర్ఫార్మ్ కావడానికి కొన్ని లాజిస్టికల్ సమస్యలు కూడా కారణమయ్యాయని నాని తెలిపాడు.సినిమాను ఇంకా మెరుగ్గా తెరకెక్కించే అవకాశం ఉందని నాని అన్నాడు. అయితే సినిమా ఫలితాన్ని పక్కన పెడితే శ్రీకాంత్ ఓదెల టాలెంట్‌పై తనకు ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశాడు. శ్రీకాంత్ దగ్గర చాలా బలమైన ఆలోచనలు ఉన్నాయని, అతడి ప్రతిభపై తనకు పూర్తి నమ్మకం ఉందని నాని చెప్పాడు. ది ప్యారడైజ్ తర్వాత శ్రీకాంత్ మరింత బలంగా తిరిగి వస్తాడనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు నాని.'ది ప్యారడైజ్' తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవితో సినిమా చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను నాని తన నిర్మిస్తున్నాడు. ఈ సినిమాను చాలా కాలం క్రితమే అధికారికంగా ప్రకటించారు. అయితే ది ప్యారడైజ్ రిజల్ట్ నేపథ్యంలో చిరంజీవి ప్రాజెక్ట్‌కి బ్రేక్ పడిందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ప్రచారంపై నాని స్పందిస్తూ.. ది ప్యారడైజ్ ఆలస్యం కావడం వల్ల చిరంజీవి తన ఇతర ప్రాజెక్టులు, కమిట్‌మెంట్స్‌తో ముందుకు వెళ్లారని తెలిపాడు. సినిమా ఆగిపోయిందని మాత్రం తాను చెప్పలేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం ది ప్యారడైజ్ తర్వాత తాను చిరంజీవిని కలవలేదని, ఇద్దరూ కూర్చొని మాట్లాడిన తర్వాత



# ఆరుగురు పతివ్రతలు' మళ్లీ వస్తున్నారు

ఈవీవీ సత్యనారాయణ బోల్డ్ అండ్ రియలిస్టిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించిన సినిమా 'ఆరుగురు పతివ్రతలు'. 2004లో రిలీజైన ఈ మూవీ అప్పట్లో ఓ టాలీవుడ్ లో సెన్సేషన్ గా నిలిచింది.. అప్పటివరకు ఎక్కువగా ఫ్యామిలీ, కామెడీ సినిమాలతో తెరకెక్కించిన డైరెక్టర్ ఈవీవీ సత్య నారాయణ ఈ బోల్డ్ మూవీని తెరకెక్కించడం గమనార్హం. ఈ సినిమాకు కేవలం డైరెక్టర్ గానే కాదు నిర్మాతగానూ వ్యవహరించారు ఈవీవీ. కల్ట్ ఫాలోయింగ్‌తో పాటు సెపరేట్ ఫ్యాన్ బేస్ సొంతం చేసుకున్న ఈ సినిమా థియేటర్లలో మళ్లీ రిలీజ్ కానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వచ్చేసింది. 'ఆరుగురు పతివ్రతలు' మూవీని 4ఖ వెర్షన్‌లో అక్టోబర్ 29 (గురువారం) మళ్లీ రీ రిలీజ్ చేయనున్నారు. ఈ మేరకు స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ బోల్డ్ సినిమాలో సినిమాలో దాదాపు 40 మంది కొత్త వారు నటించడం విశేషం. అమృత, లహరి, చలపతి రావు, ఎల్‌బీ శ్రీరామ్, శ్రీకృష్ణ కౌశిక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. భార్యాభర్తల మధ్య అనుబంధం, వివాహేతర సంబంధాలు, లైంగిక సమస్యలు, బలవంతపు పెళ్లిళ్లు, సైకోలాంటి భర్తల సైకాలజీ, లవ్, ఎమోషన్స్ వంటి అంశాలను ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారు డైరెక్టర్ ఈవీవీ. మరి అప్పట్లో ఓ మోస్తరుగా ఆడిన ఈ ఆరుగురు పతివ్రతలు సినిమా రీ రిలీజ్ లో ఏ మేర ఆకట్టుకుంటుందో చూడాలి.ఆరుగురు పతివ్రతలు సినిమా విషయానికి వస్తే.. పదో తరగతిలో కలిసి చదువుకున్న



# ఆ సినిమా ఫ్లాప్ తో చాలా ఇబ్బందిపడ్డా..

తెలుగు సినిమా ఇండస్ట్రీలో దర్శకుడు పరశురామ్ పెట్ల తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనను చాలామంది 'బుజ్జి' అనే పేరుతో కూడా పిలుస్తారు. ముఖ్యంగా ప్రేమకథలు, కుటుంబ భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను కలిపి సినిమాలు తెరకెక్కించడం ఆయన శైలిలో కనిపిస్తుంది.

దర్శకుడు పరశురామ్ తన సినీ ప్రస్థానంలోని ఎత్తుపల్లాలను, ముఖ్యంగా సార్ వచ్చారు చిత్రం తర్వాత ఎదురైన తీవ్రమైన సవాళ్లను వివరించారు. సార్ వచ్చారు తన జీవిత కాల డ్రీమ్ ప్రాజెక్ట్ అని, అయితే దాని వైఫల్యం తన కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో అపారమైన ప్రతిభావంతుడిగా కీర్తించిన వారు సైతం దూరం కావడమే కాకుండా, తనను గాయపరిచారని పరశురామ్ ఆవేదన వ్యక్తం చేశారు. సార్ వచ్చారు ఫ్లాప్ తర్వాత రెండేళ్ల నుంచి మూడేళ్ల పాటు తాను తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఈ కష్ట కాలంలో తన భార్య మాత్రమే తనకు గట్టిగా నిలబడి మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. అప్పటివరకు తనకు సినీ అవకాశాలు తగ్గిపోవడంతో పాటు, తనను ఎవరూ పట్టించుకోని స్థితి ఏర్పడిందని తెలిపారు. తన గత చిత్రం సోలో విజయం సాధించినప్పటికీ, సార్ వచ్చారు వైఫల్యం కారణంగా తనను తాను నిలబెట్టుకోలేకపోయానని ఒప్పుకున్నారు. తన అతి మర్యాద, మొహమాటం కారణంగానే తాను ఈ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఎవరి తప్పు తెలుగు సినిమా ఇండస్ట్రీలో దర్శకుడు పరశురామ్ పెట్ల తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనను చాలామంది 'బుజ్జి' అనే పేరుతో కూడా పిలుస్తారు. ముఖ్యంగా ప్రేమకథలు, కుటుంబ భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను కలిపి సినిమాలు తెరకెక్కించడం ఆయన శైలిలో కనిపిస్తుంది.

లేదని ఆయన స్వీయ విమర్శ చేసుకున్నారు.

ఈ సంక్షోభ సమయంలో అల్లు అరవింద్, బన్నీ వాసు తనకు అండగా నిలిచారు. బన్నీ వాసు అప్పుడప్పుడు ఫోన్ చేసి పలకరించేవారని, ఆ ఫోనే తనకు గొప్ప రిలీఫ్‌నిచ్చేదని పరశురామ్ చెప్పారు. అల్లు అరవింద్ తనను పిలిచి, తన డెబ్యూ చిత్రం సోలోను అల్లు శిరీష్ ఎంతగానో ఇష్టపడతారని చెప్పి, శిరీష్‌తో సినిమా చేయమని అడిగారు. అప్పటికే ఒక రీమేక్ చిత్రాన్ని తీయమని అడిగినా, తనకు రీమేక్‌లు చేయడం ఇష్టం లేదని, స్వంత కథలపైనే తనకు నమ్మకం ఉందని చెప్పి నిరాకరించారు. ఆ తర్వాత అల్లు శిరీష్ కోసం శ్రీరస్తు శుభమస్తు కథను రాశారు. అల్లు అరవింద్ తనకు పది లక్షల చెక్కు ఇచ్చారని, అప్పట్లో ఆ చెక్కు తనకు వంద కోట్ల రూపాయలతో సమానమని పరశురామ్ భావోద్వేగానికి లోనయ్యారు.శ్రీరస్తు శుభమస్తు చిత్రం విజయం సాధించడంతో పరశురామ్ కెరీర్‌కు ఒక పెద్ద మలుపు లభించింది. ఈ సినిమా విజయంతో తాను ఉన్నానని, తాను ఒక దర్శకుడిగా, రచయితగా నిలబడ్డానని అల్లు అరవింద్ ఇచ్చిన ధైర్యమని పరశురామ్ స్పష్టం చేశారు. ఈ సినిమా విడుదల సమయంలోనే తనకు కుమారుడు జన్మించాడని, అల్లు అరవింద్ పట్ల కృతజ్ఞతగా తన కొడుకుకు అవ్యాన్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. సినిమా పరిశ్రమలో హిట్ లేదా ఫ్లాప్ అనేవి కథకు అవకాశాలు నిర్ణయించవని, ఒక మంచి కథే విజయానికి పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. ముందు సినిమా హిట్ అయినంత మాత్రాన తదుపరి అవకాశాలు సులభంగా రావని, ప్రస్తుత కాలంలో హీరోలు కూడా మంచి కథలనే కోరుకుంటారని పరశురామ్ వివరించారు.

# ఓటీటీలో ట్రెండ్ అవుతోన్న రేణూ దేశాయ్



సాధారణంగా కాశీ వెళ్లొచ్చిన వాళ్లు.. "కాశీలో అది వదిలిపెట్టాం, ఇది వదిలిపెట్టాం" అని చెబుతుంటారు. కానీ దర్శకుడు యమునా కిశోర్ గారు కాశీని చూసిన కోణం చాలా లోతైనది. "కాశీ మన నుంచి ఏమీ తీసుకోదు.. మన గుండెల్లో ఉన్న బాధను మాత్రమే తీసుకుంటుంది, తిరిగి మనకు స్వచ్ఛమైన సంతోషాన్ని ఇస్తుంది" అనే ఒక అద్భుతమైన తాత్విక థీమ్‌తో ఆయన కాశీ మజిలీ సినిమాను మలిచారు. మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ గొప్ప ఆలోచనే నేడు విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. తన 'డ్రీమ్ మర్చంట్స్' సంస్థ ద్వారా ఇప్పటివరకు 600కు పైగా అడ్వర్టైజ్‌మెంట్‌లను (యాడ్ ఫిల్మ్స్) రూపొందించిన అపారమైన అనుభవం దర్శకుడు డి. యమునా కిశోర్ గారి సొంతం. నిరంతరం గ్లామర్, హంగులతో కలర్‌ఫుల్‌గా ఉండే ఆ యాడ్ ప్రపంచం నుంచి కాసేపు బయటికి వచ్చి.. పూర్తిగా ఆధ్యాత్మిక వాసనలు గుబాళించేలా, మనసుకు హత్తుకునేలా ఈ సినిమా తీయడం ఆయనలోని అసలైన సృజనాత్మకతకు, వైవిధ్యానికి నిదర్శనం.రేణు దేశాయ్, శంకర్ ఇందుచూడన్ ప్రధాన పాత్రల్లో సహజమైన నటనతో ఆకట్టుకున్న ఈ సినిమా కోసం, దివంగత మహాకవి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు రాసిన ఒక అపురూపమైన పాటను ఉపయోగించారు. కథలోని ఆత్మను ప్రేక్షకుడి గుండెల్లోకి చేర్చడానికి సిరివెన్నెల గారి సాహిత్యాన్ని ఎంచుకోవడం,

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224